RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 313 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

శుక్రవారం 31, మార్చి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## రైళ్లలో మిల్లెట్స్ ఆహారం



లక్నో, మార్చి 30 (ప్రజామంటలు):: రైలు ప్రయాణికులకు మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహారాన్ని అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఐఆర్‌సీటీసీ వెల్లడించింది. ఆహారానికి సంబంధించిన మెనూలో వీటిని చేర్చాలని ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లోని సిబ్బందికి సూచించామని తెలిపింది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోని ఐఆర్‌సీటీసీ క్యాంటీన్ల లోనూ మిల్లెట్స్ (చిరుధాన్యాలు)తో తయారు చేసిన ఆహారాన్ని అందించాలని ఆదేశించినట్టు పేర్కొంది.



## సీతారామ కళ్యాణం.. కమనీయం



* వేదోక్తంగా భద్రాచల సీతారామ కళ్యాణం
* అభిజిత్ లగ్నంలో కళ్యావేడుకలు
* పట్టు వస్త్రాలు సమర్పించిన ఇంద్రకరణ్ రెడ్డి
* చినజీయర్ స్వామి, దత్తాత్రేయ, స్పీకర్ తమ్మినేని హాజరు

భద్రాచలం,మార్చి30(ప్రజామంటలు): భద్రాచలంలో శ్రీసీతారాములవారి కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా కన్నుల పండువగా సాగింది. కనులవిందుగా రామచంద్రస్వామివారి కల్యాణ క్రతువును వేదపండితులు నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణం జరిగింది. మిథులా స్టేడియం లోని మండపంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీసీతారాములు కళ్యాణమండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. ఉదయం 10:30 గంటలకు కళ్యాణోత్సవం ప్రారంభం అవగా.. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యలకు రుత్వికులు జీలకర్ర బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. తరువాత తలంబ్రాల కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగే కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు.

మిగతా... 2లో

## రాష్ట్రవ్యాప్తంగా రామనవమి వేడుకలు

కళ్యాణోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు

హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు): రాష్ట్రవ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను

మిగతా... 2లో



# కేంద్రం పెట్రో ధరల దోపిడీ

* కార్పోరేట్లకు మేలు కలిగేలా చర్యలు
* బ్యారెల్ ధరలు తగ్గినా తగ్గని పెట్రో ధరలు
* బిజెపిని వదిలించుకుంటేనే ధరాఘాతం పోతుంది
* కేంద్రానికి బహిరంగ లేఖ రాసిన మంత్రి కెటిఆర్





హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు): పెట్రో ఉత్పత్తుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మంత్రి కెటిఆర్ డిమాండ్ చేశారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచేసి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను నిలువునా దోచుకుంటోందన్నారు.. ఈ దోపిడీకి అంతర్జాతీయ ముడిచమురు ధరలను బూచిగా చూపించి కేంద్రం ఇంతకాలం చెప్పిన మాటలన్నీ కల్లబొల్లి కబుర్లేనని తేలిపోయింది. పెట్రో ధరల దోపిడీపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. ప్రతిపక్ష పార్టీలు సైతం కేంద్రంపై విమర్శలు గుప్పించాయి. అయితే తాజాగా పెట్రో దోపిడీపై కేంద్రానికి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. 2013లో ఒక బ్యారెల్ ముడి చమురు ధర 110 డాలర్లు ఉన్నప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ రేటు కేవలం 76 రూపాయలు. కానీ నేడు బ్యారెల్ ముడిచమురు రేటు దాదాపు సగం పడిపోయినా.. అంటే 66 డాలర్లకు తగ్గినా, ప్రస్తుతం పెట్రోల్ ధర లీటర్ కు 110 రూపాయలు ఉండడమే ఇందుకు నిదర్శనం. అందుకే దేశంలో పెట్రోల్ ధరల పెంపునకు కారణం ముడిచమురు కాదని, మోడీ నిర్ణయించిన చమురు ధరలేనని మనం గతంలో చెప్పిన మాటలు అక్షర సత్యాలని మరోసారి రుజువైంది. కేవలం ముడి చమురును ఒక బూచిగా చూపించి తన కార్పొరేట్ మిత్రుల ఖజానాను లాభాలతో నింపేందుకు మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ ముడి చమురులు ధరలతో ఏమాత్రం సంబంధం లేకుండా దేశంలో పెట్రోల్ ధరను అమాంతం పెంచుకుంటూ పోతోంది. పెట్రోల్ డీజిల్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ధరల భారంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2014 నుంచి ఇప్పటిదాకా దాదాపు 45శాతం పైగా పెట్రో ధరల పెంపు వల్ల సరుకు రవాణా భారమై, సామాన్యుడు కొనుగోలు చేసే ప్రతి సరుకు ధర భారీగా పెరిగింది. నిత్యావసర వస్తువులు, కూరగాయల నుంచి మొదలుకొని పప్పు ఉప్పు వరకు అన్ని రకాల ప్రాథమిక అవసరాల ధరలు ఆకాశాన్ని తాకాయి. భారీగా పెరిగిన డీజిల్ ధరల వలన ప్రజా రవాణా వ్యవస్థ సంక్షోభం అంచుకి చేరుతోంది. దీంతో అన్ని రాష్ట్రాల్లో ప్రజా రవాణా చార్జీలను పెంచాల్సిన అనివార్య పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం సృష్టించింది.

మిగతా... 2లో

## విభజన హామీలు విస్మరించిన మోడీ

* ట్విట్టర్‌లో విమర్శలు గుప్పించిన కెటిఆర్



హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు): విభజన చట్టం లోని హామీలను కేంద్రం విస్మరించిందని ప్రధాని మోడీపై తెలంగాణ మంత్రి కేటీఆర్ మరో సారి విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధాని మోడీ ప్రాధాన్యతలో తెలంగాణ లేదని.. అలాంటప్పుడు రాష్ట్ర ప్రజల ప్రాధాన్యతలో మాత్రం ప్రధాని మోడీ, బిజెపి ఎందుకుండాలని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రానికి ఏమీ ఇచ్చేది లేదని మోడీ సర్కారు తేల్చి చెప్పింద న్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆయన ట్వీట్ చేశారు. తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు ఇవ్వనని మోడీ చెప్పారు. మెట్రో రెండో దశ, ఐటీఐఆర్, గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హౌదా ఇచ్చేది లేదని తేల్చేశారు. రాష్ట్ర ప్రాజెక్టుకు జాతీయ హౌదా ఇచ్చేది లేదన్నారు. విభజన చట్టంలోని హామీలను మోడీ అమలు చేయట్లేదు. వీటన్నింటికీ రాష్ట్రంలోని నలుగురు బిజెపి ఎంపీలు బాధ్యత వహించాలి' అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.



## రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం

* గరిష్ఠంగా 15,497 మెగావాట్ల డిమాండ్

హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు): ఎండలతో పాటు విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. మార్చి మాసాంతంతో ఎండల తీవ్రత అనూహ్యంగా పెరిగింది. రాష్ట్ర చరిత్రలోనే గురువారం అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. ఉదయం 11:01 గంటలకు గరిష్ఠంగా 15,497 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈ నెల ప్రారంభం నుంచే 15 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు అధికారు

మిగతా... 2లో

## శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి

* బావి కప్పకూలిన ఘటనలో ఆరుగురు మృతి
* ఘటనపై సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని

ఇండోర్,మార్చి30(ప్రజామంటలు): శ్రీరామనవమి వేళ మధ్యప్రదేశ్ ఇండోర్‌లో విషాదం చోటుచేసుకుంది. బావి పైకప్పు కూలిన ఘటనలో ఆరుగురు దుర్మరణం చెందారు. స్నేహ్ నగర్ పటేల్ నగర్ శ్రీ బోలేశ్వర్ మహాదేవ్ ఝూలేలాల్ మందిరంలో ఘోర ప్రమాదం జరిగింది. దేవాలయంలోని మెట్ల బావి వద్ద భక్తులు పూజలు చేస్తుండగా పైకప్పు కూలిపోయింది. దీంతో భక్తులు బావిలో పడిపోయారు. ఇప్పటివరకూ 15 మందిని కాపాడారు. ఆరుగురు చనిపోయినట్లుగా అధికారులు నిర్ధారించారు. రెస్క్యూ టీమ్ సహాయక చర్యలు కొనసాగిస్తోంది.

మిగతా... 2లో





## టోల్ ఛార్జీలు భారీగా పెంపు

* ఏప్రిల్ 1నుంచి పెంచిన చార్జీలు అమలు

హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు): కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై టోల్ ఛార్జీలు 5శాతానికి పెంచింది. పెరిగిన ధరలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలవుతాయని ప్రకటించింది. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో టోల్ ఛార్జీలను సమీక్షిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది 5 నుంచి 10 శాతం వరకు ఛార్జీలు పెంచుతున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ఉన్న టోల్ ప్లాజాల్లో ఏప్రిల్ 1 నుంచి పెరిగిన ఛార్జీలు అమలవుతాయి. జాతీయ రహదారులపై తిరిగే అన్ని రకాల వాహనాల (బైక్ మినహా) టారిఫ్ ధరలను రూ.10 రూ.60 వరకు పెంచారు. ఈ క్రమంలో ఎన్ హెచ్ 65 మీదుగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లిరావడానికి వాహనదారులు భారీ మొత్తంలో టోల్ చెల్లించాల్సి ఉంటుంది.

మిగతా... 2లో

## దేశంలోమళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు


* ఢిల్లీలో ఆందోళనకర స్థాయిలో కేసుల సంఖ్య

న్యూఢిల్లీ,మార్చి30(ప్రజామంటలు): కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు భారీగా నమోదవుతున్నాయి. గత కొద్ది రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనకర స్థాయిలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. బుధవారం రికార్డ్ స్థాయిలో ఒక్కరోజులో 300 కరోనా కేసులు నమోదైయ్యాయి. గత 6 నెలల తర్వాత మొదటి సారి రోజువారి కరోనా కేసులు 300 దాటాయి. ఈ నేపథ్యంలో కరోనా కేసుల పెరుగుదలపై మార్చి 30వ తేదీన

మిగతా... 2లో



## ప్రజానాడి




## సికింద్రాబాద్,తిరుపతిల మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్

ఏప్రిల్8న ప్రారంభించనున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,మార్చి 30 (ప్రజామంటలు): సికింద్రా బాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు దక్షిణమధ్య రైల్వే శుభవార్త చెప్పింది. తిరుపతికి వెళ్లే వేలాది మంది భక్తుల అవసరాలను తీర్చడానికి... సికింద్రా బాద్ తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. దీనికోసం ప్రధాని మోడీ ఏప్రిల్ 8న సికింద్రాబాద్ రానున్నారు. అంతే కాకుండా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను వచ్చే ఏప్రిల్ 8న ప్రారంభించనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ పనులను శంకుస్థాపన

మిగతా... 2లో



## పేపర్ లీకేజీలో తవ్వినకొద్దీ కొత్త విషయాలు

* ఏఈ పేపర్‌తో దాదాపు రూ.25లక్షలు వసూలు
* పేపర్ కోసం నీలేశ్, గోపాల్ నాయక్ రూ.13.5 లక్షలు చెల్లింపు
* వరుసగా రెండోరోజూ కొనసాగిన సిట్ దర్యాప్తు

హైదరాబాద్, మార్చి 30 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేస్తున్న టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో రోజురోజుకు అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. సిట్ విచారణలో తవ్వే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు బయటపడుతున్నాయి. తాజాగా ఈ కేసులో విస్తుపోయే అంశాలు బయట పడ్డాయి. గురువారం ఉదయం రెండో రోజు పేపర్ లీకేజీ నిందుతులను సిట్ ప్రశ్నిస్తోంది. ఈ కేసులో నిందితుడు డాక్యానాయక్ ఏఈ పేపర్‌తో దాదాపు రూ.25లక్షలు వసూలు చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పేపర్ కోసం నీలేశ్, గోపాల్ నాయక్ రూ.13.5 లక్షలు చెల్లించారు. వీరిద్దరూ పొలం తాకట్టుపెట్టి మరీ ఇంత మొత్తంలో డబ్బును డాక్యాకు అప్పజెప్పి పేపర్‌ను కొనుగోలు చేశారు. అలాగే రాజేందర్ రూ.5 లక్షలు, ప్రశాంత్ రూ.7.5 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు. ఏఈ ప్రశ్నాపత్రం కోసం ప్రశాంత్ బంగారం తాకట్టు పెట్టి మరీ రూ. 7 లక్షలు తెచ్చినట్లు విచారణలో బయటపడింది.




మిగతా... 2లో

# పేపర్ లీకేజీలో తవ్వినకొద్దీ కొత్త విషయాలు

**మొదటిపేజీ తరువాయి..**

దాక్యా నాయక్ బ్యాంక్ ఖాతాలను సిట్ అధికారులు పరిశీలిస్తు న్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్ అధికారులు చేసిన దర్యాప్తు ప్రకారం ఇప్పటి వరకు ఏఈ పేపర్లు 12 మందికి, గ్రూప్-1 పేపర్లు ఐదుగురికి లీకైనట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు అరెస్టుల సంఖ్య 15కు చేరింది. న్యూజిలాండ్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి బావ ప్రశాంత్‌రెడ్డితో కలిసి నిందితుల సంఖ్య 16కు చేరుకుంది. లీకేజీ విషయం టీఎస్‌పీఎస్సీలో ఇంకా ఎంతమంది ఉద్యోగులకు తెలుసన్న కోణంలో సిట్ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఏఈ పేపర్ లీకేజీకి సంబంధించిన నలుగురు నిందితుల కస్టడీ మంగళవారంతో ముగిసిన సంగతి తెలిసిందే. వారిని విచారించిన క్రమంలో పలు ఆసక్తికర విషయాలు తెలిసినట్లు సమాచారం. పేపర్‌ను కొన్న వారంతా అప్పులు చేసి, ఆస్తులు కుదువ పెట్టి.. రేణుక భర్త ఢాక్యా నాయక్, ఆమె తమ్ముడు రాజేశ్వర్‌కు డబ్బులిచ్చామని చెప్పినట్లు తెలిసింది. పేపర్ లీకేజ్ కేసులో ముగ్గురు నిందితుల కస్టడీ విచారణ రెండో రోజు కొనసాగింది. గురువారం నిందితులను హిమాయత్ నగర్ సిట్ ఆఫీస్ కు తరలించారు పోలీసులు. షమీమ్, రమేష్, సురేష్ లు రాసిన గ్రూప్ -1 పేపర్ పై సిట్ అధికారులు ప్రశ్నించారు. గ్రూప్ 1 పేపర్ ప్రవీణ్ నుంచి చేరినట్లు ముగ్గురు నిందితులు సిట్ కు స్టేట్ మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురు వేరే ఎవరికైనా పేపర్స్ ఇచ్చారా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఏఈ పేపర్ తో నిందితుడు డాక్యా నాయక్ ఐదుగురి నుండి రూ.25 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు.

# రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం

**మొదటిపేజీ తరువాయి..**

వెల్లడించారు. విద్యుత్ వినియోగంలో దక్షిణాదిన తెలంగాణ రెండో స్థానంలో ఉంది. మార్చి 14వ తేదీన మంగళవారం ఉదయం 10:03 గంటలకు 15,062 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావువెల్లడించిన సంగతి తెలిసిందే. సరిగ్గా రెండు వారాల తర్వాత గురువారం ఉదయం 11:01 గంటలకు 15,497 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ వినియోగం పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు పారిశ్రామిక అవసరాలు పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఎక్కువైందన్నారు. రాష్ట్రంలో మొత్తం విద్యుత్ డిమాండ్‌లో 37 శాతం వ్యవసాయ రంగానికి వినియోగించబడుతోందని పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ రంగానికి అత్యధిక విద్యుత్ వినియోగం చేస్తున్న రాష్ట్రం తెలంగాణానే అని స్పష్టం చేశారు. గత సంవత్సరం మార్చి నెలలో అత్యధికంగా 14,160 మెగా వాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. గత డిసెంబర్‌లో ఈ రికార్డును అధిగమిస్తూ 14,750 మెగావాట్ల పీక్ విద్యుత్ వినియోగం జరిగింది. కాగా తాజాగా గురువారం 15,497 మెగావాట్ల విద్యుత్ వినియోగమైంది. మార్చి నెలలో 15వేల మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవుతుందని ముందే ఊహించామని సీఎండీ ప్రభాకర్ రావు తెలిపారు. అందుకే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరాకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కాగా ఈ ఏడాది వేసవి కాలంలో 16వేల మెగా వాట్లకు పైగా డిమాండ్ ఏర్పడవచ్చని అంచనా వేశారు. ఎంత డిమాండ్ వచ్చినా కూడా ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి

**మొదటిపేజీ తరువాయి..**

క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ప్రధాని మాట్లాడారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. మరోవైపు కలెక్టర్, కమిషనర్‌లతో మాట్లాడిన చౌహాన్ ఘటనపై విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మరోవైపు ఘటనపై పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

# టోల్ ఛార్జీలు భారీగా పెంపు

**మొదటిపేజీ తరువాయి..**

ప్రస్తుతం ఈ హైవేపై రూ. 465 చెల్లిస్తున్నారు. అయితే, ఇకనుంచి రూ.490 చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఈ లెక్కన రూ.25 టోల్ ఛార్జ్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రూట్ లో పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ హైవేపై ఒకవైపు ప్రయాణానికి రూ.310 చెల్లిస్తుండగా, ఇకపై 325 చెల్లించాలి. మినీబస్సులు, లైట్ మోటార్ వాణిజ్య, సరకు రవాణా వాహనాలు, భారీ, అతి భారీ వాహనాలపై ప్రస్తుతం వసూలు చేస్తున్న మొత్తానికి అదనంగా 5 శాతం కట్టాల్సి వస్తుంది.

## దేశంలో మళ్లీ పెరుగుతున్న
# కరోనా కేసులు

**మొదటిపేజీ తరువాయి..**

గురువారం ఢిల్లీ ప్రభుత్వ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనుంది. ఢిల్లీ వైద్యశాఖ మంత్రి సౌరబ్ భరద్వాజ్ కరోనా పరిస్థితిపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు. ఇక దేశంలో వారంరోజుల క్రితం వరకు వెయ్యికి



పరిమితమైన రోజువారి కోవిడ్ కేసుల నమోదు.. తాజాగా 3 వేల మార్క్‌కు చేరుకున్నాయి. గడిచిన 24 గంటల్లో 3,016 కొత్తగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో 24గంటల్లో దాదాపు 40శాతం కోవిడ్ -19 కేసుల సంఖ్య పెరిగింది. రోజువారీ కేసుల విషయంలో దాదాపు ఆరు నెలల్లో ఇదే అత్యధికం. యాక్టివ్ కేసుల సంఖ్య కూడా పెరిగింది. దేశంలో 13,509 మంది కొవిడ్ తో చికిత్స పొందుతున్నారు. దీంతో పాజిటివిటీ రేటు 2.73శాతంకు చేరింది. వారం క్రితం పాజిటివిటీ రేటు 1.71శాతం ఉంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. గడిచిన 24 గంటల్లో దేశంలో కోవిడ్-19 కారణంగా 14 మంది మరణించారు. దీంతో ఇప్పటికే దేశంలోకరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 5,30,862 కు చేరింది. మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీలో ఇద్దరు మరణించారు. కోవిడ్ కేసుల రికవరీ రేటు 98.78శాతం ఉంది. వారం రోజుల వ్యవధిలోనే కరోనా పాజిటివ్ కేసులు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

# సీతారామ కల్యాణం.. కమనీయం

**మొదటిపేజీ తరువాయి..**

సీతారాముల కళ్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో సాగింది. ప్రతీ ఏడాది కంటే ఈసారి భిన్నంగా శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. మిథులా స్టేడియానికి సువర్ణ ద్వాదశ వాహనాలపై స్వామిఅమ్మవార్లు ఊరేగింపుగా వచ్చారు. కళ్యాణాన్ని కనులారా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల



నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేదమంత్రోచ్చరణల నడుమ వధూవరులైన సీతారాములను ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి పండితులు తీసుకొచ్చారు. అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో శ్రీరాముడు మాంగళ్యధారణ చేసారు. జగదభిరాముని కల్యాణాన్ని కనులారా వీక్షించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీమాన్నారయణ జీయర్ స్వామి దగ్గరుండి కళ్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణ వేడుకకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైకోర్టు న్యాయమూర్తి నవీన్ రావు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ తాతా మధు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు కల్యాణ ఘట్టం జరిగింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో జగదాబిరాముడు, లోకపావని సీతాదేవి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగడంతో భక్తులు పులకించి పోయారు. రాములోరి కల్యాణ విశిష్టతతో పాటు, భద్రాద్రి ఆలయ చరిత్ర, వైభవాన్ని భక్తులకు వేద పండితులు వివరించారు. భద్రాచలం ఆలయం ఆరుబయట మిథిలా స్టేడియంలో కల్యాణ వేడుక ఏటా జరిగినట్లే జరిగింది. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియంతో పాటు, భద్రాద్రి పుర వీధులు



మార్మోగాయి. అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో శ్రీరాముడు మాంగళ్యధారణ చేయడంతో భక్తులు రామనామంతో పులకించారు. సీతారాముల కల్యాణాన్ని కనులారా వీక్షించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారి కల్యాణానికి భద్రాచలంలోని మిథిలా స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. కల్యాణానికి వచ్చే భక్తులతో భద్రాద్రి కిక్కిరిసి పోయింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని.. వేలాదిమంది కూర్చొని వీక్షించేలా చలువ పందిర్లు ఏర్పాటు చేశారు అధికారులు. ఎండ తీవ్రతను తట్టుకునేలా ఫ్రీగా మంచి నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపినీ చేసారు. ఉదయం 9.30 గంటలకు కల్యాణ మూర్తులను వేద మంత్రోచ్చారణల నడుమ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ఉదయం 10.30 నుంచి కల్యాణ తంతు ప్రారంభం అయింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు పునర్వసు నక్షత్రం అభిజిత్ లగ్న సుమూహూర్తాన కల్యాణ మహోత్సవం జరిగింది.

# రాష్ట్రవ్యాప్తంగా రామనవమి వేడుకలు

**మొదటిపేజీ తరువాయి..**

అందంగా విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు. తెల్లవారు జాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరం లోని పలు ఆలయాల్లో శ్రీరామ కళ్యాణాలను నిర్వహించారు. సీతారామ్ బాగ్ సహా అనేక ఆలయాల్లో కళ్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం గాంధీ పార్క్



వద్దగల రామ మందిరంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర గిరిజన, స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి సత్యవతి రాథోడ్ స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పాలకుర్తి నియోజక వర్గంలో రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలను సతీమణి ఉషా దయాకర్ రావు తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం మాటేడు, తొర్రూరు, నాంచారి మదూరు, వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజక వర్గం రాయపర్తి తదితర దేవాలయాల్లో కళ్యాణోత్సవాలకు మంత్రి హాజరయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు.పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి



ఆలయం, ఖిలావనపర్తి ఆలయంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సూర్యాపేట లోని బొడ్రాయి బజార్‌లోని శ్రీ వేదాంత భజన మందిరంలో జరిగిన శ్రీరామ కళ్యాణ మహోత్సవంలో మంత్రి జగదీష్ రెడ్డి, సునీత దంపతులు పాల్గొని పట్టువస్త్రాలు , ముత్యాల తలంబ్రాలు అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రామాలయంలో జరిగిన కళ్యాణంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. నల్లగొండ లోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పాలకమండలి చైర్మన్ లకు నల్లగొండ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి దంపతులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన, తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, పూజా ద్రవ్యాలు భక్తిశ్రద్ధలతో అందజేశారు.

## సికింద్రాబాద్,తిరుపతిల మధ్య
# వందే భారత్ ఎక్స్‌ప్రెస్

**మొదటిపేజీ తరువాయి..**

చేసేందుకు ప్రధాని మోదీ రానున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు ప్రధాని మోడీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీనికోసం ఏర్పాట్లు చేస్తున్నామని రైల్వే అధికారులు వివరించారు. ఇదిలావుంటే హైదరాబాద్- ముంబై- చెన్నైతో పాటు మరో ఆరు హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)ల తయారీ పనిని రైల్వే శాఖ ప్రారంభించిందని కేంద్రం వెల్లడించింది. లోక్ సభలో ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు రైల్వే శాఖ మంత్రి ఆశ్వినీ వైష్ణవ్ ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తెలంగాణలో రైలు కోచ్ ఫ్యాక్టరీ పెట్టే ప్రతిపాదన ఏదీ లేదని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రైల్వే కోచ్ ల తయారీకి అవసరమైన ఫ్యాక్టరీలను ఇప్పటికే మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ డిపార్ట్ మెంట్లలో 2021 మార్చి 1 నాటికి 9, 79,327 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఎంపీ నామా అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. ఇందులో అత్యధికంగా రైల్వేలో 2,33,943 ఉద్యోగాలు, డిఫెన్స్ లో 2,64,706, హోం శాఖలో 1,83, 538 జాబ్స్ ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

# హైదరాబాద్‌లో వేడుకగా శ్రీరామ్ శోభాయాత్ర

## భారీ భద్రత కల్పించిన నగర పోలీసులు

**హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు):** శ్రీరామనవమి సందర్భంగా పాతబస్తీ లోని సీతారాంబాగ్ రామమందిరం నుంచి శ్రీరామ్ శోభాయాత్ర గురువారం ఉదయం ప్రారంభమైంది. సీతారాంబాగ్ ఆలయం నుంచి హనుమాన్ వ్యాయమశాల వరకు శోభాయాత్ర కొనసాగనుంది. మొత్తం 6.5 కిలో మీటర్ల మేర శోభాయాత్ర జరుగనుంది. శ్రీరామ్ శోభాయాత్రలో భారీగా భక్తులు పాల్గొన్నారు. సీతారాంబాగ్ ఆలయం - బోయగూడ కమాన్ నుంచి మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, జాలి హనుమాన్, దూల్‌పేట, పురానాపూల్, జుమేరాత్ బజార్, చుడిబజార్, బేగంబజార్ చత్రి, బర్తన్ బజార్, సిద్దంబర్ బజార్ మసీదు, శంకర్ షేర్ హోటల్, గౌలిగూడ కమాన్, గురుద్వారా, పుత్లిబౌలి చౌరస్తా, కోఠి ఆంధ్రా బ్యాంక్ మీదుగా సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాలకు యాత్ర చేరుకుంటుంది. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. దాదాపు రెండు వేల మందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్, ఆక్టోపస్ బలగాలతో శోభాయాత్రపై నిఘా పెట్టారు. డ్రోన్ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఈ యాత్రను



పోలీసులు పర్యవేక్షించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ కూడా ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

# కేంద్రం పెట్రోధరల దోపిడీ

**మొదటిపేజీ తరువాయి..**

అలాగే కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల గత 45 ఏళ్లలో ఎప్పుడు లేనంత ద్రవ్యోల్బణం దేశాన్ని పట్టిపీడిస్తోందని వివరించారు. ఇన్నాళ్లు అంతర్జాతీయ ముడి చమురు ధరల ప్రస్తావన లేదా ఉక్రెయిన్- రష్యా యుద్ధం పేరు చెప్పి దేశ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాన్ని మోడీ ప్రభుత్వం చేసింది. కానీ ఒకవైపు రష్యా నుంచి అత్యంత తక్కువ ధరకు చమురు దేశానికి భారీగా దిగుమతి చేసుకుంటున్నామని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు తక్కువ ధరకు ముడిచమురు అందుబాటులో ఉన్నా, ప్రజల జేబుల నుంచి పెట్రోల్ ధరల పేరుతో చేస్తున్న దోపిడీకి మాత్రం సమాధానం చెప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న 35 వేల కోట్ల రూపాయల ముడిచమురు పొదుపు ప్రయోజనమంతా కేవలం ఒకటి రెండు ఆయిల్ కంపెనీలకే దక్కిందన్నది వాస్తవం. దేశీయ వినియోగం పేరు చెప్పి భారీగా రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ముడిచమురును, శుద్ధి చేసి తిరిగి విదేశాలకు అమ్ముకుంటున్న కీలకమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చెప్పకుండా దాచి ఉంచుతోందన్నారు. తక్కువ ధరకు ముడి చమురును కొని తిరిగి విదేశాలకే పెట్రోలు అమ్ముతున్న కంపెనీలకు వచ్చిన అడ్డగోలు లాభాలను దృష్టిలో పెట్టుకుని, దానిపై ప్రభుత్వానికి వచ్చే విండ్ ఫాల్ పన్నును కేంద్ర ప్రభుత్వం తగ్గించిన విషయాన్ని గమనించాల న్నారు. కార్పొరేట్ కంపెనీలకు పన్నులు తగ్గించినప్పటికీ.. దేశ ప్రజల పట్ల మాత్రం పెట్రోల్ పేరుతో దోపిడీని కొనసాగిస్తున్న కఠినాత్ముడు ప్రధానమంత్రి మోడీ అని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరుతున్నాను. అలాగే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 2013 లో ఉన్న స్థాయికి పడిపోయిన నేపథ్యంలో భారీగా పెంచినందున పెట్రోల్ రేటును తగ్గించాలని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి మోడీ సారథ్యంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దేశ ప్రజల నుంచి పెట్రోల్ ధరల రూపంలో చేస్తున్న దోపిడీని ఆపాలని డిమాండ్ చేస్తున్నాను. మరోవైపు తెలంగాణ లాంటి రాష్ట్రాలు 2014 నుంచి ఒక్క రూపాయి వ్యాట్ ను పెంచకున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం సెస్సుల పేరుతో 30 లక్షల కోట్లకు పైగా ప్రజల నుంచి కొల్లగొట్టింది. కానీ ఈ నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వం పైకి నెట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధర 70 డాలర్ల లోపు చేరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోల్ రేటును తగ్గించేందుకు కేంద్రం విధించిన సెస్సులను పూర్తిగా ఎత్తివేయాలన్నారు. పెట్రోల్ ధరలు తగ్గాలంటే దాన్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యత కలిగిన మంత్రులు చెప్పడం గురువింజ సామెతను తలపిస్తుంది. జీఎస్టీ పరిధిలో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను 400 రూపాయల నుంచి 1200 కు పెంచిన అసమర్ధ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఉంది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్యాస్ సిలిండర్ ధర పెంచిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాలకు కల్లబొల్లి కబుర్లు చెప్పడం అర్ధరహితం. ఇప్పటికే జీఎస్టీ పరిధిలో ఉన్న సిలిండర్ ధరలను కేంద్రం ఎందుకు తగ్గించలేకపోయిందో ముందు సమాధానం చెప్పాలన్నారు. ఇకపోతే ధరల పెరుగుదల అంశం పార్లమెంటులో చర్చకు రాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. అయితే దేశ ప్రజలు మోడీ ప్రభుత్వం చేస్తున్న ఈ పెట్రో దోపిడీని గమనిస్తున్నారు. పెరిగిన పెట్రోల ధరల తాలూకు దుష్పరిణామాలను అనుభవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వమే ఒక దోపిడీదారుగా మారి ప్రజల జేబులో నుంచి దోచుకుంటున్న పెట్రో భారం తగ్గాలంటే, భారతీయ జనతా పార్టీని వదిలించుకోవడమే ఏకైక మార్గం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ దోపిడీని ఆపాలి, లేకుంటే ప్రజల చేతిలో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు.

# బళ్ళారి మేయర్‌గా 23 ఏళ్ల యువతి

## ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హవా

**బళ్లారి,మార్చి30(ప్రజామంటలు):** కర్ణాటక రాష్ట్ర రాజకీయ చరిత్రలో 23 ఏళ్ల యువతి మేయర్‌గా ఎన్నికై సరికొత్త రికార్డు సృష్టించారు. కాంగ్రెస్ పార్టీ



తరపున పోటీ చేసిన డి త్రివేణి సూరి బళ్లారి నగర కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికయ్యారు. దీంతో కర్ణాటకలో మేయర్‌గా ఎన్నికైన అతి పిన్న వయస్కురాలిగా త్రివేణి గుర్తింపు పొందారు. కాంగ్రెస్‌కు చెందిన జానకమ్మ అనే అభ్యర్థి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన బళ్లారి మేయర్ ఓటింగ్‌లో త్రివేణి 28 ఓట్లతో బీజేపీ అభ్యర్థి నాగరత్నమ్మపై గెలుపొందారు. నాగరత్నమ్మ16 ఓట్లను మాత్రమే పొందగలిగారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలతో కలిపి సభ మొత్తం ఓటర్ల సంఖ్య 44. కాగా పారామెడికల్ డిగ్రీ హోల్డర్ అయిన త్రివేణి కాంగ్రెస్ పార్టీ తరపున 18 ఏళ్లకే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. విమ్స్ వైద్య కళాశాలలో డిఎ÷-లొమా ఇన్‌ఫార్మసీ పూర్తి చేశారు. త్రివేణి ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. కార్పొరేటర్ల సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తానని త్రివేణి వెల్లడించారు.

# భారత్‌లో పాక్ ట్విట్టర్ ఖాతా నిలిపివేత

**న్యూఢిల్లీ,మార్చి30(ప్రజామంటలు):** పాకిస్తాన్ కు భారత్‌లో భారీ షాక్ తగిలింది. ఆ దేశ ప్రభుత్వ అధికారిక ట్విట్టర్ ఖాతాను ట్విట్టర్ ఇండియా నిలిపివేసింది. లీగల్ డిమాండ్ నేపథ్యంలోనే మార్చి 30వ తేదీ నుంచి ఆ ఖాతాను భారత్‌లో ట్విట్టర్ బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సరైన కారణాన్ని ఇప్పటి వరకు ట్విటర్ వెల్లడించలేదు. భారత్‌లో ఉన్నవారు ఖాతాను యాక్సెస్ చేయడానికి ప్రయత్నించగా.. 'అకౌంట్ విత్‌హెల్డ్' అని చూపిస్తోంది. భారత్‌లో పాక్ ట్విట్టర్ ఖాతా నిలిపివేయడం ఆరు నెల్లలోనే ఇది రెండోసారి. ఈ విషయంపై భారత్, పాకిస్థాన్ అధికారుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ ప్రభుత్వ ట్విట్టర్ ఖాతా ను భారతదేశంలో చూడకుండా బ్లాక్ చేసినట్లు సోషల్ మీడియా ఎలాట్ ఫామ్‌లోని నోటీసుల ప్రకారం వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. కంపెనీ మార్గదర్శకాలు, కోర్టు ఆర్డర్ వంటి చెల్లుబాటు అయ్యే చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా... ట్విట్టర్ పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ఖాతాను భారత్‌లో బ్లాక్ చేసినట్లు పేర్కొంది. అమెరికా, కెనడా వంటి ఇతర దేశాల్లో పాకిస్థాన్ ప్రభుత్వ ట్విటర్ ఖాతా పని చేస్తోంది.

## పసిఫిక్ సముద్రంలో
# నౌకలో ప్రమాదం

## అగ్నిప్రమాదంలో 31మంది మృత్యువాత

**మనీలా,మార్చి30(ప్రజామంటలు):** పసిఫిక్ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఓ నౌకలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 31 మంది మరణించారు. 14 మంది గాయపడగా, ఏడుగురు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. 230 మందిని రక్షించామని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. వివరాల ప్రకారం.. లేడీ మేరీ జాయ్ -3 నౌక మిండానావో ద్వీపంలోని జాంబోంగా సిటీ నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో ద్వీపానికి వెళుతుండగా బుధవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 31 మంది



మరణించినట్లు బాసిలన్ గవర్నర్ జిమ్ సల్లిమాన్ తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రయాణికులు నిద్ర మత్తులో ఉండగా ప్రమాదం జరిగిందని, దీంతో భయంతో కెప్టెన్ నౌక వేగం పెంచారని అన్నారు. ప్రయాణికులు చాలా మంది నీటిలో దూకేశారని అన్నారు. ప్రమాద సమయంలో నౌకలో 250 మంది ప్రయాణికులు ఉన్నట్టు స్పష్టం చేశారు. ప్రమాదం తర్వాత ఫిలిప్పీన్ కోస్ట్ గార్డ్, మత్స్యకారులు కలిసి 195 మందిని కాపాడినట్లు తెలిపారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని అన్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

# బొమ్మకల్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**సైదాపూర్ మార్చి 30 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం వే. సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామంలో హై స్కూల్ లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన బొమ్మకల్ గ్రామ ఎంపిటిసి ఏరుకొండ ఇందిరా సుధీర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం కంటి చూపు కోల్పోయిన



పేదలకు సరైన వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని అలాగే వారికి కళ్ళజోడును అందిస్తుందని, శస్త్ర చికిత్స కూడా ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి చిట్టి ప్రకాశ్, రుద్రారపు రవితేజ, వేముల నారాయణ, ఒజ్జ ఓదెలు, కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పోషకాహార పదార్థాలపై అవగాహన సదస్సులు

**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** పోషణ్ అభియాన్, పోషణాపక్షం సందర్భంగా మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జనగామ సెక్టార్ పరిధిలో మరిగడి



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పోషకాహార పదార్థాల గురించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అనంతరం అంగనవాడీ టీచర్స్ యాకలక్ష్మి, సుజాత, విజయ ఆధ్వర్యంలో "పోషకాహారం-విటమిన్ల ప్రాముఖ్యత" అనే అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకుంట్ల మురళి, ఉపాధ్యాయులు స్టీఫెన్, సాంబరాజు, ఆశా వర్కర్ లత, అంగన్‌వాడీ హెల్పర్ అనసూర్య పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల జీవితం ప్రపంచానికి ఆదర్శం

### వల్మీడికి భద్రాచలానికి మించిన వైభోగం

### తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఎర్రబెల్లి దంపతులు

**పాలకుర్తి మార్చి 30 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సుడిగాలి పర్యటన చేశారు. శ్రీ రామ నవమి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలు వారి సతీమణి ఉషా దయాకర్





రావుతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం మాటేడు, తొర్రూరు, నాంచారి మడూరు, వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి తదితర దేవాలయాల్లో కళ్యాణోత్సవాలకు హాజరైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు దంపతులు, జనగామ జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య దంపతులు, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణం











**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణం అంగడి బజార్, శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చేర్మన్ గోలి శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు ఆకుబత్తిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు చింతకింది రవిచందు, సహాయ కార్యదర్శి బోగ రాజు కుమార్, కోశాధికారి మానపురి శ్రీనివాస్, డైరెక్టర్లు మరియు బిఆర్ఎస్ నాయకులు క్యాదాసు నాగయ్య, మాజీ అధ్యక్షులు జెడి, పద్మశాలి నాయకులు ఎలిగేటి నరసయ్య, వీరబత్తిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జనగామలో.**

జనగామ పట్టణంలోని గుండ్ల గడ్డ శ్రీ ఉమామహేశ్వర గుడిలో, శ్రీ సీతారాముల కళ్యాణం, అనంతరం మహా అన్నదానం. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు.

**జనగామ శ్రీరాం నగర్ కాలనీలో......**

**కన్నుల పండుగగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం**

జనగామ లోని శ్రీరాం నగర్ కాలనీ, మూలబావి లో గల శ్రీ హనుమత్ రామనాథ సమేత శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ రామనవమి ఉత్సవాలు అంగరంగ మహా వైభవంగా నిర్వహించారు. భక్తజన సంద్రం నడుమ, రామనామ సంకీర్తనల నడుమ కన్నుల పండుగగా శ్రీ సీతారామచంద్రస్వామి వారల కళ్యాణ మహోత్సవాన్ని జరిపారు. ప్రధాన అర్చకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో ప్రాతఃకాల సుప్రభాత సేవతో మొదలుకొని సీతరామచంద్రస్వామి మూలవిరాట్టులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం స్వామి వారలకు ఆరాధనలు జరిపారు. కళ్యాణోత్సవంలో భాగంగా కాలనీలో ఎదుర్కోళ్లు జరిపారు, దిష్టికుంభం, మండప ప్రవేశ అనంతరం గణపతి పూజ, పుణ్యాఃవచనం, రక్షాబంధనం, కళశారాధనలు జరిపారు., అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన సాక్షాత్ నారాయణుడు శ్రీ రామచంద్ర స్వామి వారి ఆవాహన, అర్ఘ్య, పాద్య, ఆచమనీయాలు, మధుపర్కాల సమర్పణ, యజ్ఞోపవీత ధారణలు జరిపారు., అనంతరం అఖిల జగన్మాత, అశరణ్య శరణ్య శ్రీ సీతామాత ఆహ్వానము అనంతరం పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున వైదిక మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సుముహూర్తం జరిపారు. అనంతరం జనక మహారాజు స్వరూపులుగా పూజలో పాల్గొన్న దంపతులు సీతామాతని కన్యాదానం చేశారు. మాంగళ్యధారణ, అక్షరోతారోపనం, అష్టోత్తర శతనామార్చన, శాత్తుముర్రై సేవ, మహా నీరాజనం, మహామంత్రపుష్పం అత్యంత వైభవోపేతంగా జరిగాయి., సాయంత్రం పల్లకి ఊరేగింపు సేవతో ఉత్సవాన్ని ముగించారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ.... శ్రీరామనవమి సందర్భంగా యావత్ దేశవ్యాప్తంగా ప్రతీ గ్రామంలో, ప్రతీ పట్టణంలో ఊరువాడ ఏకమై శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారని, హిందువులని ఏకం చేసే అత్యంత ప్రధానమైన ఉత్సవమన్నారు,. రాముడి గుణగణాలను, ధర్మాచరణను కీర్తిస్తూ సీతామాత త్యాగనిరతని గుర్తు చేసారు. సీతారాములను ఆదర్శంగా తీసుకొని జీవించాలని కొరారు. ఈ పూజా కార్యక్రమాల్లో ధార్మికవరేణ్యులు, శ్రీ విద్యా ఉపాసకులు చావళి విజయలక్ష్మీ చంద్రశేఖర్ శర్మ దంపతులు పాల్గొనగా, శ్రీరామోపసాకులు, గాయకులు శ్రీరాంభట్ల శ్రియా ఆదిత్య శర్మ దంపతలు తమ అద్భుత గాత్రంతో, కీర్తనలతో అలరించారు.. ఈ ఉత్సవాల్లో కమిటీ గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి, అధ్యక్షులు జక్కా నర్సిరెడ్డి, కందాడి మల్లారెడ్డి, పాశం శ్రీశైలం, యెలసాని కృష్ణమూర్తి, కుర్రెముల రాంప్రసాద్, కళ్లెం నాగరాజు, ఉపేందర్ రెడ్డి, హనుమారెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, సత్యనారాయణ, వేణుగోపాల్, చంద్రమౌళి, రవి, శాయితేజ భార్గవ, శ్రీనివాస్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

**జనగామ, బాలాజీ నగర్‌లో .**

జనగామ పట్టణంలోని బాలాజీ నగర్ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శ్రీ సీతారామ కళ్యాణం పూజారి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మెరుగు సుధాకర్, సుజాత దంపతులు, వారి కుటుంబ సభ్యులు మెరుగు ప్రభాకర్, మెరుగు సురేందర్, మెరుగు దేవరాజ్, లగిశెట్టి కృష్ణమూర్తి, పద్మావతి, సరోజన, భవాని, ఆర్ఎంఓ డాక్టర్ సుగుణాకర్ రాజు, కాలనీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి కట్నకానుకలు సమర్పించారు.

**జనగామ కళ్లెం రోడ్ శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో.....**

జనగామ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగామ పోపా కమిటీ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు, అక్కలదేవి సింహాద్రి, పోపా ఉపాధ్యక్షులు ఏల జనార్దన్, కాముని శ్రీనివాస్, బాబు దోర్నాల కుమార్, అధికార ప్రతినిధి పిట్టల సతీష్, సహాయ కార్యదర్శిలు మదాసు ఎల్లయ్య, నల్ల ఆంజనేయులు, కోశాధికారి బిట్ల విజయ్ కుమార్, పోపా గౌరవ అధ్యక్షులు గుమ్మడవెల్లి సత్యనారాయణ, మాజీ పోపో గౌరవ అధ్యక్షులు మచ్చ బాలనరసయ్య, దోర్నాల రమేష్, మంగళంపల్లి జనార్దన్, మంగళంపెల్లి లక్ష్మినారాయణ, మంతెన వీర నర్సయ్య, బిర్రు సత్యనారాయణ, కాముని లక్ష్మణ్, రచ్చ శ్రీశైలం, చింతకింది ఉపేందర్, చింతకింది వేణుమాధవ్, బిర్రు శ్రీనివాస్, మహేశ్వరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధర్మరాజ దశమి సందర్భంగా

# ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు

**రామ కిష్టయ్య సంగన భట్ల**

**ధర్మపురి మార్చి 30 (ప్రజామంటలు):** భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టుకొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచార కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదా యినిగా విరాజిల్లుతున్నది... జగిత్యాల జిల్లాలోని గోదావరీ తీరస్థ సుప్రసిద్ధ తీర్థమైన ప్రాచీన ధర్మపురి పుణ్యక్షేత్రం. తెలుగు నేలపై సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరిహర క్షేత్రంగా, పౌరాణిక ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నదీ క్షేత్ర రాజం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడినది. ఈక్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమ ధర్మరాజు మందిరం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావని లోనే అరుదుగా, అపురూపంగా ధర్మపురి క్షేత్రంలో వెలసిన "యమ ధర్మరాజును దర్శిస్తే యమపురి ఉండబోదని" ప్రతీతి. హిరణ్యకశిపుని సంహారానంతరం, ఉగ్ర నారసింహుని శాంతింప జేసేందుకై బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థమూ, పవిత్ర క్షేత్రమూ అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానాది సత్కర్మల నొనరించినట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమ ధర్మరాజు, తన లోకమునందు అనేక నరక బాధలను అనుభవించు చున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తను ఇట్లు విచారించెనని, పుణ్యాత్ములను దర్శించినచో పుణ్యము, పాపాత్ములను చూసినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుటచే తనకు పాప సంచయమే కలుగు చున్నదని, తన యందు స్వయంకృత పాప మనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనముతో మనశ్శాంతి కలుగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్య క్షేత్ర దర్శన ప్రయాణ ఉన్ముఖుడై, సమస్త క్షేత్రముల తిరిగి చివరకు ధర్మపురికి ఏతెంచెనని, ఈ క్షేత్రమున గోదావరి నదీ స్నానమాచరించగనే యమునకు మనశ్శాంతి కలుగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెనని, బ్రహ్మాండ, స్కాంద పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు, నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమ ధర్మ రాజు నృసింహుని మందిరాని కేగి చేసిన పూజలకు ప్రసన్నుడైన నారసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించుమని తెలిపెనని, యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమకుండ"మని పేరు కలుగునట్లు, అచట స్నానమాచరించి నృసింహుని పూజించు వారికి యమలోక బాధలు కలుగ కుండునట్లు, సర్వపాప విముక్తి కలుగునట్లు నరసింహుడు వరమిచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును శ్రీనరసింహ మందిర పురోభాగమున నిలిపినట్లు పురా ణాలు విశదీకరిస్తున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన ఉంది యమ ధర్మరాజు మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. 'దక్షిణాభి ముఖీగంగా, యత్ర దేవో నృకే సరీ, తత్రశ్రీర్విజయోర్భూతి:, కాశ్య యశ్యత గుణం భవేత్" అని దక్షిణాభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన ధర్మపురి



క్షేత్రం విశిష్టతను కలిగి యున్నది. వేరెచ్చటనూ కానరాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తున్నది. అష్ట దిక్పాలకులలో ఒకరైన యముడు దక్షిణ దిశాధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా కుజుడు దక్షిణ దిశాధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడని పరాశరుడు "బృహత్ పరాశర హోరా శాస్త్రం" నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినియైన గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరించి, నరసింహుని దర్శిస్తే నరక బాధలుండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యతను సంతరించికున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజునును దర్శించే భక్తుల సంఖ్య నానాటికీ అధిక మవుతున్నది. ఇటీవల సంభ విస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్త" ప్రత్యేక పూజాదులలో అంతర్భాగంగా అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్త పఠనాలు, జ్వరహర స్తోత్రం, రోగ నివారణ సూక్తాలు,యమాష్టకాది పూజలలో పాల్గొనేందుకై సుదూర ప్రాంతాల నుండి భక్తులు క్షేత్రానికి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య నానాటికీ అధికమవుతున్నది. మార్చి 31వ తేదీ "ధర్మరాజ దశమి లేదా యమ ధర్మరాజ దశమి" మృత్యు సంబంధ హిందూ దేవుడు అయిన యమ భగవానుడికి అంకితం చేయబడింది. యమ ధర్మరాజు అని కూడా పిలువబడే యమ ధర్మరాజు కు అంకితం చేసిన పూజ ఆ రోజు జరుగుతుంది. ఈ వ్రతాన్ని 10వ రోజు చైత్ర మాసం శుక్ల పక్షంలో పాటిస్తారు. ప్రాథమికంగా రోజున చేసే పూజలు భక్తుడి నుండి మరణ భయాన్ని తొలగించడానికి సహాయ పడుతాయి.

# భర్త చేతిలో హతమైన భార్య రాజేశ్వరి

**వెల్కటూరు మార్చి 30 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. భార్యను కత్తితో హత్య చేసి చంపిన భర్త. గ్రామానికి చెందిన బొల్లం జగదీష్ అనే వ్యక్తి మద్యానికి బానిసై ప్రతి రోజు త్రాగుతూ ఇంట్లో గొడవ పడేవాడు. ఇంట్లో తన భార్య రాజేశ్వరితో తరచు గోడవపడేవాడు. బుధవారం అర్ధ రాత్రి మద్యం మత్తులో ఇద్దరు గొడవపడ్డారు. త్రాగిన మైకంలో ఇంట్లోని ఈలపీటతో నరికి చంపాడు. అనంతరం జగదీష్ పారిపోయాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఇందుర్తిలో

# నేటి నుండే వాలీబాల్ టోర్నమెంట్

### ఇందుర్తి జట్టుకు క్రీడా సామాగ్రి, టీ షర్టులు అందజేసిన కంది మల్లారెడ్డి

**చిగురుమామిడి మార్చి 30( ప్రజామంటలు):** ఇప్పటివరకు 16 టీ%శీ%లు పాల్గొంటున్నట్లు యువకులు తెలిపారు ఇందుర్తి వాలీబాల్ జట్టుకు కంది మల్లారెడ్డి (లడ్డు) క్రీడాకారులకు వాలీ బాల్స్ తో సహా టీ షర్టులను తన సొంత ఖర్చులతో బహుకరించారు. అనంతరం




నిర్వాహకులు మాట్లాడుతూ.... గ్రామాల్లోని యువకుల నైపుణ్యాన్ని బయటకు తీయడానికి ఈ టోర్నమెంట్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు వాలీబాల్ కిడ్స్ తో సహా డ్రెస్ కూడా అందించిన కందిమల్లారెడ్డిని పలువురు అభినందించారు. లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఫైనల్ విన్నర్ కు రూ. 10000, రన్నరుకు రూ. 4500 క్యాష్ బహుమతితో పాటు మెమొంటో అందచేయనున్నట్లు అధ్యక్షులు గాదే రఘునాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, ప్రదీప్, పవన్, టింకు అరుణ్, కంది మల్లారెడ్డి, హరీష్, సాయి లక్ష్మణ్, మనోజ్ పాల్గొన్నారు.

## తెవిస జిల్లా

# అధ్యక్షులుగా వాంకుడోత్ బికోజి

### ప్రధాన కార్యదర్శిగా కె.వి. రమణాచారి ఎన్నిక

**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** జనగామ జిల్లా తెలంగాణ వికాస సమితి జనగామ జిల్లా నూతన అధ్యక్షులుగా వాంకుడోత్ బికోజీ, ప్రధాన కార్యదర్శి కె.వి. రమణాచారి గురువారం ఎన్నికయ్యారు. తెలంగాణ వికాస సమితి ప్రస్తుత అధ్యక్షులు



పానుగంటి రామమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటి సభ్యులు రమేష్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వికాస సమితి తెలంగాణ పునర్నిర్మాణంలో నిర్మాణాత్మకమైన క్రియాశీల పాత్రను పోషిస్తోందని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షులు వాంకుడోత్ బికోజి, ప్రధాన కార్యదర్శి కె.వి రమణాచారి, కో-ఆర్డినేటర్ రాజా సంపత్ దూడల, కోశాధికారి అంజయ్య మామిండ్ల, ఉపాధ్యక్షులు అవినాష్, కొత్తపల్లి మనోహార్, బాషీపెల్లి, రమేష్ వనమాల, సహాయ కార్యదర్శి లక్ష్మణ్ తాళ్లపల్లి, సుధాకర్ గాదరి, రవి బస్వ, కార్యవర్గ సభ్యులు రాజేంద్రప్రసాద్, నర్సమ్మ, తిరుపతి రెడ్డి గోలి, రాష్ట్ర కమిటీ సభ్యులు రామమూర్తి పానుగంటి, జయపాల్ రెడ్డి నిమ్మ, దసురు బానోతు, రవిందర్ బానోతుని ఎన్నుకున్నారు.

# రాజకీయ అవినీతి,అక్రమాలకు కళ్లెం వేయాల్సిందే!

నేరాలు ఎలాంటివైనా..వివిధ కోర్టుల్లో శిక్షలు పడి చట్టసభల్లో సభ్యత్వాన్ని కోల్పోవడం అవసరమే. రాజకీయ నేతలకు ఏదైనా భయం ఉండాల్సిందే. లోక్‌పాల్ లాంటి పటిష్ఠ సంస్థ ఉంటే రాజకీయ అవినీతికి కళ్లెం వేయగలం. రాజకీయ నేతల అవినీతిపై విచారణలు చేసి, శిక్షలు వేస్తే దేశంలో సకలదరిద్రం వదులుతుంది. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రాజకీయ అవినీతికి చరమగీతం పాడాల్సి ఉంది. దేశంలో భయం అన్నది లేకుంటే రాజకీయ విచ్చలవిడితనం వస్తుంది. అయితే అన్ని విషయాల్లోనూ నిబంధనలు లేదా చట్టాలు కఠినంగా ఉండాలి. ఎలాంటి కేసులో అయినా సత్వర విచారణ జరగాలి. సత్వరంగా శిక్షలు పడాలి. ప్రజలు మాత్రమే ప్రతి చిన్న విషయంలో కోర్టుల శిక్షలకు గురవుతున్నారు. నిజానికి రాజకీయ నాయకులు చేస్తున్న అవినీతిపై శిక్షలు పడాలి. అలాంటి వారు చట్టసభలకు అనర్హులు కావాలి. ఎపి సిఎం జగన్ కేసులు అయినా..వైఎస్ వివేకానంద హత్య కేసు అయినా..కాళేశ్వరం అవినీతి అయినా.. పేపర్ లీకేజి కేసులు అయినా..లిక్కర్ స్కామ్ అయినా..ఆదానీ. మోడీ లింక్ అయినా దర్యాప్తు జరగాల్సిందే. ఈవిషయంలో పార్టీలకు, పాలకులకు అతీతంగా దర్యాప్తులు సాగాలి. అప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగుతుంది. ఒక్క రాహుల్ విషమే కాదు..ఎలాంటి అవినీతిలో అయినా వెంటనే విచారణ జరగాలి. శిక్ష విధించాలి. అప్పుడు అవినీతికి కారకులైన వారిని చట్టసభలకు దూరం చేయగలగాలి. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. భారత ప్రజాస్వామ్యం గౌరవం ఇనుమడిస్తుంది. నిజానికి రాహుల్‌కు పడ్డ శిక్ష విషయంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నిబంధన కాదు. గతంలో కూడా బీజేపీతోపాటు పలు రాజకీయ పార్టీల నాయకులు కోర్టుల్లో నేరస్తులుగా ఋజువు కాగానే చట్టసభల్లో సభ్యత్వాన్ని కోల్పోయారు. పశువుల దాణా కుంభకోణంలో దోషిగా కోర్టు ప్రకటించగానే బిహార్ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది యూపీఏ ప్రభుత్వమే. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష పడగానే తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తన పదవులన్నీ కోల్పోయారు. అలాగే లక్షద్వీప్ ఎన్సీపీ ఎంపీ మహ్మద్ ఫైజల్‌కు స్థానిక న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించడంతో లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్‌సింగ్ షైనీ 2013లో జరిగిన ముజఫర్‌నగర్ అల్లర్ల కేసులో 2022లో శిక్ష పడగా తన సభ్యత్వాన్ని కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌కే చెందిన మరో బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సింగర్ మరో కేసులో శిక్ష పడి సభ్యత్వాన్ని కోల్పోయారు. అధికారంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నప్పటికీ వీరు తమ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఒకవేళ అది ప్రభుత్వం, పార్టీ తీసుకునే నిర్ణయమే అయితే బీజేపీ తమ పార్టీ సభ్యుల సభ్యత్వం రద్దుకాకుండా కాపాడుకొని ఉండేది. ఎందుకంటే ఇప్పుడు కేసుల దర్యాప్తుల విషయంలో బిజెపియేతర నేతలపైనే విచారణలు సాగుతున్నాయి. కాబట్టి పార్టీల ప్రాబల్యం లేకుండా సహజంగానే ఎలాంటి కేసు అయినా విచారణ సాగాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. తప్పు



చేసిన వారికి శిక్ష పడాల్సిందే... ఇలాంటి మాటలు చెప్పే ప్రభుత్వ పెద్దలే, నాయకులే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం లోక్‌సభ సెక్రటేరియట్ రాహుల్ గాంధీపై చర్యలు తీసుకుంటే తప్పుపట్టడం సరికాదు. దాన్ని బీజేపీకి ఆపాదించడం కన్నా అందరికీ వర్తించేలా చట్టానికి మరింత పదను పెట్టాలి. సుప్రీంకోర్టు ముందుకు వస్తే తప్ప ఇలాంటి కేసుల సత్వర విచారణ సాగదు.ఏదైనా కేసులో శిక్షలుపడితే దాంట్లో నిజానిజాలు గమనించాలి.అంతేతప్ప విమర్శలు చేయరాదు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ తీసుకున్న నిర్ణయంపై విపక్షలు విమర్శలు చేయడం. ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అంటూ తప్పుపట్టడం సరికాదు. దీంతో తప్పొప్పులను కోర్టులకు వదిలేయాలి. మోదీ పాలన నియంతృ త్వం అయితే..ఆయా రాష్ట్రాల్లో నియంతలుగా మారుతున్న ప్రాంతీయ పార్టీల అధినేతలుగా ఉన్న ముఖ్యమంత్రులు కూడా ఆలోచన చేయాలి. ఎవరు ఎంతగా నియంతృత్వంగా ఉన్నారో ప్రజలను అడిగితే చెబుతారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఆపాదించి విమర్శించడం సమంజసం కాదు. అయితే ఇక్కడ కేంద్రంలో ఉన్న బిజెపి కొంత అత్యుత్సాహం చూపింద నడంలో సందేహం లేదు. నోటి దురుసుతనంతో ఇబ్బందుల పాలవడం రాహుల్ గాంధీకి కొత్త కాదు. రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు విషయంలో కూడా ఇలాగే ప్రధాని మోదీపై నోరు పారేసుకు న్నారు. అప్పుడు మోదీని ఉద్దేశించి 'చౌకీదార్ చోర్ హై' అని విమర్శించడంతో, సుప్రీంకోర్టు తీవ్ర చర్యలకు పూనుకోగా రాహుల్ బేషరతు క్షమాపణలు చెప్పి ఆ కేసు నుంచి బయటపడ్డారు. లేకుంటే ఆయన అప్పుడే తన సభ్యత్వాన్ని కోల్పోవలసి వచ్చేదేమో. అప్పుడు క్షమాపణ చెప్పినట్టే ఈ కేసులోనూ క్షమాపణ చెబితే సూరత్ కోర్టు కూడా సుప్రీంకోర్టు లాగా అర్థం చేసుకొని మందలించి వదిలిపెట్టేదేమో? మరి ఎందుకలా చేయలేదు? ఇప్పుడు జరుగుతున్న పరిణామాలన్నింటిని పరిశీలిస్తే రాజకీయాల కోసమే కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు కలిసి ప్రయత్నిస్తున్నాయనిపిస్తోంది. కోర్టు నిర్ణయం ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయినా, ఎమ్మెల్సీ కవిత మద్యం దందా కేసులో ఇరుక్కొని విచారణ ఎదుర్కొంటున్నా, బీఆర్‌ఎస్ మంత్రివర్గంలోని కొందరు మంత్రులు, నాయకులు అక్రమ సంపాదన విషయంలో ఇన్‌కమ్ టాక్స్, ఈడీ, సీబీఐల దాడులు ఎదుర్కొన్నా... ఈ చట్టబద్ధ చర్యలపై 'కక్ష సాధింపు చర్య'లన్న ముద్ర వేసి విమర్శలు చేయడం సరికాదు. అవినీతి విషయంలో ముందు నేతలు నిజాయితీగా ఉండాలి. నిప్పులేనిదే పొగరాదు.

అవినీతి మరక లేనిదే ఆరోపణలు రావు. విపక్షాలు అన్నీ కలసి బీజేపీని నిందించడం..బిజెపి విపక్షలను నిందించడం మానుకోవాలి. విచారణకు సంబంధించి లోక్‌పాల్ కావాలన్న డిమాండ్ అటకెక్కింది. రాజకీయ పార్టీల అవినీతికి లోక్‌పాల్ లాంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలు ఉండాలి. సర్పంచ్ నుంచి ప్రధాని వరకు ఎవరు అవినీతి, అక్రమాలకు పాల్పడినా విచారణకు సిద్ధపడాలి. అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుంది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## తిక మక

సురేంద్ర ,నరేంద్ర ఇద్దరు అన్నదమ్ములు. సురేంద్ర బడి నుండి రాగానే శుభ్రంగా కాళ్లు, చేతులు కడుక్కునేవాడు, కానీ నరేంద్ర కాళ్లు, చేతులు కడుక్కోకుండానే ఇంట్లోకి వెళ్లేవాడు .సురేంద్ర చిల్లర తిను తినేవాడు కాదు ,నరేంద్ర ఎక్కువగా చిల్లర తిను తినేవాడు.



సురేంద్రకు మాటిమాటికి కాళ్లకు ,చేతులకు కురుపులు అయ్యేవి! తొందరగా తగ్గేవి కావు కానీ నరేంద్ర ఆరోగ్యంగానే ఉండేవాడు!!

డాక్టర్ గారి దగ్గరికి సురేంద్రను, వాళ్ళ అమ్మానాన్నలు తీసుకువెళ్లారు .సురేంద్ర గురించి చెప్పారు. డాక్టర్ అన్ని పరీక్షలు చేయించి, "కుర్రాడికి ఇమ్యూనిటీ చాలా తక్కువగా ఉంధండి! అందుకే ఎంత శుభ్రంగా ఉన్న ప్పటికీ శుభ్రమైన ఆహారం తీసుకున్నప్పటికీ కుర్రాడు అనారోగ్యం పాల వుతున్నాడు ఆ పుల్లు తగ్గడం లేదు" అని డాక్టర్ కొన్ని మందులు వ్రాసి చ్చి ,వాడమన్నారు.

"అవునండి సురేంద్రకు ఇమ్యూనిటీ తక్కువ కాబట్టి సరిపోయింది !కానీ అదే నరేంద్రకే ఇలా ఇమ్యూనిటీ తక్కువ అయితే వాడి పరిస్థితి ఏమిటో !? అసలే వాడు అల్లరిగా ఉండడం చిల్లరిగా తినడం "అంది ఆ పిల్లల తల్లి .

"అవునవును 'అన్నాడు తండ్రి.

'ఏంటమ్మా అన్నయ్యకు ఏమైందన్నారు? డాక్టర్ గారు"నీ అడిగాడు నరేంద్ర.

విషయం అంతా చెప్పారు తల్లిదండ్రులు "అమ్మో! అన్నయ్యకే అలా ఉంటే!! ఇక నాకు ఎలా ఉంటుందో ఏమో" అని భయంగా ఆ రోజు నుండి నరేంద్ర కూడా శుభ్రంగా ఉండడం చిల్లర తిన్లు తినకుండా మానేశాడు.

– అమ్మిన వెంకట అమ్మి రాజు

పేరూరు, ములుగు జిల్లా, 94407 08656

## నిర్లక్ష్యం

వసంతవాడలో సుబ్బయ్య, పుల్లయ్య అనే ఇద్దరు మిత్రులు ఉండేవారు. సుబ్బయ్య తను చేసే పనిని నిర్లక్ష్యం చేస్తూ, బాధ్యత లేకుండా



ప్రవర్తించేవాడు. పుల్లయ్య అతి జాగ్రత్తకు పోయి నవ్వులపాలవుతుండే వాడు. ఒక రోజు సుబ్బయ్య ఇంటి సమీపంలో అగ్ని ప్రమాదం జరిగి ఇళ్ళు, గడ్డి వాములు తగలబడుతున్నాయి. చుట్టు ప్రక్కల వాళ్ళంతా ఎగిసి పడుతున్న మంటలకు భయపడి కేకలేస్తున్నారు. బిందెలు, బకెట్లతో నీళ్ళు తెచ్చి మంటల్ని ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు.

నీళ్ళ కోసం పరుగులు పెడుతున్న జనాన్ని చూచి "ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడి అన్నట్లు ఎవరిదో ఇల్లు కాలుతుంటే వీళ్ళకేం పని" అనుకున్నాడు సుబ్బయ్య. "ప్రమాదాన్ని లెక్క చేయకుండా తన మిత్రుడు పుల్లయ్య ఇంటికి చేరుకున్నాడు.

ఇంటి ప్రక్కనే అగ్ని ప్రమాదం జరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా తన ఇంటికి వచ్చిన మిత్రుణ్ణి చూచి పుల్లయ్య ఆశ్చర్యపోయాడు.

"ఏంటలా కన్నార్పకుండా చూస్తున్నావ్ ? పొలానికి వెళ్తూ నిన్ను పలకరించి పోదామని వచ్చాను" అన్నాడు సుబ్బయ్య.

" ఓరి నీ అఘాయిత్యం కూలా! నీ ఇంటి పక్కనే అంత పెద్ద అగ్ని ప్రమాదం జరుగుతుంటే ఇంత నిర్లక్ష్యంగా పొలానికెలా వెళ్తున్నావురా? నన్ను చూడు మీ వీధిలో మంటలు లేస్తే మాయింటిని నీళ్ళతో తడుపుకుంటున్నాను" అన్నాడు పుల్లయ్య.

"ఓరి నీ పిచ్చి దొంగలు తోలా! ఎంత అతిజాగ్రత్త అయితే మాత్రం మా వీధిలో మంటలు లేస్తే ఊరిచివరనున్న నీయింటి కెలా అంటుకుంటాయి? అందుకే నిన్ను అందరూ పిచ్చి పుల్లయ్య అంటుంటారు!"అన్నాడు సుబ్బయ్య వెటకారంగా.

వీరి సంభాషణ ఇలా జరుగుతుండగానే సుబ్బయ్య కొడుకు సంపత్ పరుగెత్తుకుంటూ వచ్చి "నాన్నా!..మన ఇల్లు కాలిపోతోంది తొందరగా రా" అంటూ ఏడుస్తూ చెప్పాడు.

ఇల్లు కాలిపోతోందని తెలియగానే సుబ్బయ్యగుండెల్లో రాయి పడ్డట్టయింది. కళ్ళు మూసి తెరిచేలోపే సంపత్ తో సహా ముగ్గురూ అక్కడకు చేరుకున్నారు. కాలిపోతున్న ఇంటిని చూసి సుబ్బయ్య బోరున ఏడవసాగాడు.

"నా అతిజాగ్రత్త వల్ల శ్రమ మాత్రమే వృధా అయింది . కాని నీ నిర్లక్ష్యం వల్ల ఎంతటి నష్టం జరిగిందో చూడు. జరిగిందేదో జరిగిపోయింది. ఇక మీదట మెలకువగా ఉండటం నేర్చుకుందాం!" అంటూ ఓదార్చాడు పుల్లయ్య.

నిర్లక్ష్యం ఎంతటి కీడు చేస్తుందో అప్పుడు అర్థమైంది సుబ్బయ్యకు. అప్పటి నుండి ఆ అవలక్షణాన్ని వదిలించుకున్నాడు. పైగా ఆపదలోవున్న వారిని ఆదుకుంటూ తెలివిగా బ్రతుకసాగాడు

– డా.పోతగాని సత్యనారాయణ ,ఖమ్మం

9441083763


# నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి లింగమూర్తి

## తెలుగు విశ్వ విద్యాలయ తొలి డాక్టరేట్ గ్రహీత కపిలవాయి

### మార్చి 31... కవి కేసరి జయంతి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాలపై విస్తఅత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి.

ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో



మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మఅతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు.

పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు.

ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి.

1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు.

కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకఅషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వ విద్యాలయ ప్రతిభా పురస్కారం, బూర్గుల రామకఅష్ణా రావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహ శాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందారు.

వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సఅజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# విదేశాలలో ఖలిస్తాన్ కలకలం

ఖలిస్తాన్ తీవ్రవాదులు గతంలో కెనడాకే పరిమితం. ఇప్పుడు అమెరికా,బ్రిటన్,ఆస్ట్రేలియా తదితర దేశాల్లో భారత్ వ్యతిరేక ప్రదర్శనలను నిర్వహిస్తూ త్రివర్ణ పతాకాలను అవమానపరుపరుస్తున్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో కొద్ది రోజుల క్రితం ఆందోళన జరిపిన ఖలిస్తాన్ మద్దతుదారులు శనివారం నాడు వాషిం గ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయం వద్ద హింసను ప్రేరేపించే రీతిలో ప్రసంగించారు. దౌత్య కార్యాల యంలోకి దూసుకుని వెళ్ళేందుకు ప్రయత్నిం చారు. ఎంబసీ కిటికీల అద్దాలను పగుల గొట్టారు. దౌత్యాధికారి తరన్ జిత్ సంధ్ ను అనరాని మాటలు అన్నారు. ఆ సమయంలో ఆయన ఆఫీసులో లేరు.ఈ కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న వార్తా సంస్థల విలేఖరులపై దాడులు చేశారు. భారత దేశానికి వ్యతిరేకంగా నినా దాలు చేశా రు.ఖలిస్తాన్ తీవ్రవాదులు 80 వ దశకంలో ఏ మాదిరిగా అయితే, భారత్‌ని లక్ష్యంగా చేసుకుని నినా దాలు చేశారో ఇప్పుడు కూడా అదే మాదిరి నినాదాలు చేస్తున్నారు.




ఖలిస్తాన్ అనేది ఊహాజనితమేన నీ, అది సాకారమయ్యే అవకాశాలే లేవని సిక్కుల్లో సీనియర్ నాయ కులు స్పష్టం చేస్తున్నప్పటికీ,యువతరాన్ని రెచ్చగొట్టేం దుకు కొత్తగా అమృతపాల్ సింగ్ వంటి నాయకులు తయారయ్యారు.అమృతపాల్ సింగ్ పంజాబ్‌లో ఇటీవల ఆందోళనలకు నేతృత్వం వహిస్తూ తన మద్దతు దారులను రెచ్చగొడుతున్నారు. తాను భింద్రన్ వాలా సిద్ధాంతాలకు ప్రభావితుడనైనానని అతడే స్వయంగా చెప్పుకుంటున్నాడు. పెద్దగా చదువుకోకపోయినా ఖలి స్తాన్ నినాదంతో సిక్కులను ఆ కర్షించి మళ్ళీ అలనాటి ఉద్య మాన్ని పోలిన ఆందోళన కోసం యువతను అతడు రెచ్చగొడుతున్నాడు.మాదక ద్రవ్యా ల అలవాటును మాన్పిం చడానికి అతడు ఒక డీ-అడిక్షన్ కేంద్రాన్నీ,గురుద్వారానీ కేంద్రంగా చేసుకుని తన కార్యకలాపాలను సాగిస్తున్నాడు.తన ఉద్యమం శాంతి యుతం గా సాగుతుందని ప్రకటిస్తూనే మారణా యుధాలను సేక రించి గురుద్వారా లో దాచిపెట్టాడు.

అలనాడు భింద్రన్ వాలా కూడా ప్రమా దకరమైన మార ణాయుధాలను అమృతసర్ స్వర్ణాల యంలో గుట్టలుగా పేర్చిన సంగతి వెనకటి తరానికి చెందినవారికి తెలుసు. ఖలిస్తాన్ ఉద్యమానికి తిరిగి ఊపిరి పోయడమే తన లక్ష్యమని అమృతపాల్ సింగ్ బహిరంగంగానే చెబుతు న్నారు. పంజాబ్‌కి చెందిన అతడు దుబాయ్ వెళ్ళి అక్క డ కొంతకాలం పాటు ట్రక్కు డ్రైవర్‌గా పని చేశాడు . అక్కడ సిక్కుల ప్రాపకం సంపా దించి ఐఎస్ఐ తీవ్ర వాదులతో సంబంధాలను పెంచుకున్నాడు.తిరిగి భారత్ వచ్చి అత డు ఖలిస్తాన్ అభిమా నులను సమీకరించి ఆందోళన ల ను చేపట్టాడు. గతఫిబ్రవరిలో అమృతసర్‌లోని అన్ జా లా పోలీసు స్టేషన్ వద్ద పెద్ద సాయుధ ప్రదర్శనను నిర్వ హిం చిన అతడు పోలీసుల కన్నుగప్పి పారిపోయాడ అతడి కోసం అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నా, వేషాలు మారుస్తూ,వాహనాలను మారుస్తూ తిరుగు తున్నాడు.డు అంటించిన అగ్గి విదేశాల్లోని పలు నగరా ల్లో అంటుకుంది.ఆస్ట్రేలియాలోని ప్రార్థనా మంది రాలను ఖలిస్తాన్ వాదులు తగులబె డుతు న్నారు. ఆస్ట్రేలి యా ప్రభుత్వానికి మన ప్రభుత్వం ఫిర్యాదు చేసినా ప్రయోజనం కనిపించలేదు.ఆస్ట్రేలియా ప్రధానికి మన ప్రధాని మోడీ ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం కనిపించలేదు.ఇప్పుడు కొత్తగాఅమెరికన్ నగరా ల్లో ఖలిస్తాన్ తీవ్రవాదులు ఆందోళనలు సాగిస్తున్నారు. కెనడాలోని టొరంటోలో ఒక ప్రార్థనా మందిరంలో ఖలిస్తాన్ తీవ్రవాదులు సమావేశమైనట్టు తెలియగానే, అక్కడి పోలీసులను భారత దౌత్య కార్యాలయం అప్ర మత్తం చేసింది.అయితే, స్థానికుల సాయంతో వారు పోలీసుల కన్నుగప్పి పారిపోయారు. ఖలిస్తాన్ ఆందో ?ళనకారులకు స్థానికుల నుంచి ఆర్థిక సాయం లభిస్తోంది.

కెనడాలో బాగా చదువుకున్న వారు,ఉన్నతస్థానాల్లో ఉన్న వారు ఖలిస్తాన్ తీవ్రవాదులకు అండగా నిలుస్తున్నట్టు సమాచారం . సేవ్ సిక్ అనే సంస్థను స్థాపించి వారంతా ఆందోళనలు సాగిస్తున్నారు.భారత్‌లో సిక్కులపై దాడులు జరుగుతున్నాయన్న అసత్య ప్రచారం సాగిస్తున్నారు.ఈ విషయాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ కూడా ఖండించారు.,తమ రాష్ట్రం లో సిక్కులు క్షేమంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. ఖలిస్తాన్ తీవ్రవాదులకు పాకిస్తాన్ ఐఎస్ఐ వర్గం వారు, హుక్కానీ తీవ్రవాద వర్గం వారు సాయం అందిస్తు న్నారు. నిజానికి ఖలిస్తాన్ ఆందోళన కారులకు స్థానికం గా బలం లేదు. విదేశాల్లో వ్యాపారాలు చేసుకునేవారు, ఉద్యోగాలు చేసుకునే వారి నుంచే వారికి మద్దతు లభిస్తోంది.ఈవిషయాన్ని మన ప్రభుత్వం కెనడా, అమెరి కా,ఆస్ట్రేలియా, తదితర దేశాల దౌత్యకార్యాలయాల ద్వారా ఆయా ప్రభుత్వాలకు తెలియజేసింది.

# కర్నాటకలో కానుకలు వర్షం...

కర్నాటక అసెంబ్లి ఎన్నికల నగారా మోగింది. మే 10వ తేదీన ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. మే13వతేదీన ఫలితాలు వెల్లడవుతాయి. ఈ ఫలితాల కోసం దేశమం తా ఎదురు చూస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ఈ ఎన్నికల ను రిహార్సిల్స్‌గా పరిగణిస్తున్నారు. కర్నాటకలో ఒకే విడుతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తోంది. బీజేపీ విజయం సాధించేందుకు శాయశక్తులను ఒడ్డు తోంది. అందుకే, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్ షా ఇప్పటికి పలుమార్లు పర్యటించి వాగ్దానాల వర్షం కురిపి స్తున్నారు. కాంగ్రెస్ కూడా బీజేపీకి ఏమీ తీసిపోనట్లుగా నిరుద్యోగ పట్టభద్రులకు మూడువేల భృతి ఇస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డికె శివ కుమార్ ఈ ఎన్నికల్లో అన్ని వర్గాలను కూడగట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యతో సన్నిహితంగా ఉంటూ అభ్యర్థుల ఎంపిక పై అవగాహన కుదుర్చుకున్నారు.



శివకుమార్ కళాకారు ల ర్యాలీలో ఐదువందల రూపాయిల నోట్ల వర్షాన్ని కురి పించారు. అలాగే, బీజేపీ తానేమీ తక్కువ కానన్నట్టు ప్రజలకు భారీగా తాయిలాలను ప్రకటిస్తోంది.ఈ రెండు పార్టీలు ఎన్నికల పోలింగ్‌కి చాలా ముందే కానుకలను కురిపిస్తున్నాయి.కేంద్రంలో అధికారంలో ఉంది కనుక, కాంగ్రెస్ కన్నా, ఎక్కువ ఖరీదైన కానుకలను ప్రకటిస్తోం ది. అయితే,రాష్ట్రంలో 40 శాతం పైగా ఉన్న ఒక్కళిగ, లింగాయత్ సామాజిక వర్గాలను ఆకట్టుకోవడానికి ఈ రెండు పార్టీలు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు రెండు పార్టీల్లోనూ ఉన్నారు.

మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్ప, ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయి లింగాయ త్ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా,డికె శివ కుమార్, జనతాదళ్ (ఎస్) అధ్యక్షుడు హెచ్‌డి దేవెగౌడ, ఆయన కుమారుడు కుమారస్వామి ఒక్కళిగ సామాజిక వర్గానికి చెందిన వారు. వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని సీఈసీ తొలిసారి కల్పిస్తున్నది. ఈ నిర్ణ యంతో 12.15 లక్షల మంది వృద్ధులు,5.6 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుంది. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.21 కోట్ల మంది కాగా, వారిలో వందేళ్ళు పైబడిన వారు 16,976 మంది ఉన్నారు. శతాధిక వయసు గల వారు కర్నాటకలోనే ఎక్కువ మంది ఉన్నారు. అందుకే, వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే సదుపాయాన్ని తొలిసారిగా కర్నాటకలోనే కల్పించారు. కర్నాటకలో సామాజికవర్గాల ప్రభావమే కాకుండా ధనప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎమ్మెల్యే అభ్యర్థి కోట్లలో ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.అలా ఖర్చు చేయగలిగిన వారికే ఈ రెండు పార్టీలు టికెట్లు ఇస్తున్నా యి. కాంగ్రెస్, బీజేపీలతో పోలిస్తే జనతాదళ్(ఎస్) అంత ఎక్కువగా ఖర్చు చేసే పరిస్థితి లేదు.అయితే, సామాజిక వర్గాల పరంగా ఒక్కళిగల మద్దతు జనతాదళ్ (ఎస్) కి ఉంది.రాష్ట్రంలో రాజకీయాలను శాసించే మఠాధిపతు ల ప్రాబల్యం,పలుకుబడి రాష్ట్రంలో ప్రధానంగా చెలా మణి అవుతూండేది. ఇటీవల శివసాయుజ్యం చేరిన శివ గంగ పీఠాధిపతి ఆశీస్సులతో జనతాదళ్ (ఎస్) ఎన్నిక ల్లో విజయాలను సాధిస్తూ వచ్చింది.ఇప్పుడు ఆయన అనుచరులు ఎటువైపు ఉన్నారో ఇదమిత్థంగా తెలియదు. అదేసందర్భంలో బీజేపీలో సీనియర్ నాయకుడైన మాజీ ముఖ్యమంత్రి, లింగాయత్ సామాజిక వర్గ నాయకుడు యెడియూరప్పకూ, పీసీసీ అధ్యక్షుడు శివ కుమార్‌కీ మఠాధిపతులలో మంచి పలుకుబడి ఉంది. మఠాధిపతులు ఎన్నికల్లో నేరుగా జోక్యం చేసుకోవడం కర్నాటకలోనే ఉంది.



# రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు

## రాజాసింగ్‌పై ముంబైలో కేసు

**హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు):** గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ముంబై లో కేసు నమోదైంది. గత జనవరి 29న ముంబైలో జరిగిన బహిరంగ సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్వేషపూరిత ప్రసంగం చేసినందుకు గాను రాజాసింగ్‌పై ముంబై పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. జనవరి 29న ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు గాను రాజాసింగ్‌కు హైదరాబాద్ పోలీసులు కూడా నోటీసులు ఇచ్చారు. ఓ కేసులో బెయిల్ ఇచ్చే క్రమంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దంటూ తెలంగాణ హైకోర్టు షరతు విధించిందని ఆ నోటీసులో గుర్తుచేశారు. ఈ విషయమై వివరణ ఇవ్వాలని పోలీసులు కోరారు. ముంబైలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ మంగళ్‌హట్ పోలీసులు నోటీసులు జారీ చేయడంపై రాజాసింగ్ స్పందిస్తూ ధర్మం కోసం అవసరమైతే జైలుకు వెళ్తానని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే పీడీయాక్ట్‌పై జైల్లో ఉన్న రాజాసింగ్‌కు నవంబర్ 9న తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్‌లో హైదరాబాద్ శిల్పారామంలో కమెడియన్ మునావర్ షోకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ షోకు అనుమతి ఇవ్వడంపై రాజాసింగ్ సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఈ వీడియో మహ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా ఉందని ఎంఐఎం నేతలు ఆరోపించారు. పలు ముస్లిం సంఘాలు ఆందోళనలు కూడా నిర్వహించారు. రాజాసింగ్‌పై నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ పోలీసులు పీడీయాక్ట్‌ను నమోదు చేసి జైలుకు పంపించారు. ఆ కేసులో గతేడాది నవంబర్ 9న హైకోర్టు బెయిల్ ఇచ్చింది.

# బలగం మొగిలయ్యకు మంత్రి అండ

## డయాలిసిస్ సేవలు అందేలా హరీష్ రావు ఆదేశాలు

**హైదరాబాద్,మార్చి30(ప్రజామంటలు):** బలగం' సినిమాలో నటించి, అందర్నీ కంటతడి పెట్టించిన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు మంత్రి హరీష్ రావు అండగా నిలిచారు. వార్తా ఛానెల్‌లో ప్రసారమైన కథనంపై స్పందించిన మంత్రి... పుట్టెడు కష్టాలతో, అనారోగ్య సమస్యలతో సతమవుతున్న మొగిలయ్యకు కావాల్సిన మందులు అందేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డయాలసిస్ సేవలు అందేలా ఏర్పాటు చేయాలని సూచించారు. కరోనా టైంలో మొగిలయ్య రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. దీంతో ఆయన




రోజు తప్పించి రోజు డయాలసిస్ కోసం దవాఖాన్ల చుట్టూ తిరుగుతున్నారు. 'బలగం' సినిమా చేస్తున్న సమయంలోనూ ఓ సారి ఆయన కళ్లు తిరిగి పడిపోయారు. కిడ్నీ సమస్య ఉందని డాక్టర్లు చెప్పారు. టెస్టులు చేయిస్తే.. రెండు కిడ్నీలు ఫెయిలైనట్టు రిపోర్ట్ వచ్చింది. ఇంతకుముందు కరోనా సోకడం వల్లే మొగిలయ్య కిడ్నీలు దెబ్బతిన్నాయని డాక్టర్లు అన్నారు. ఇక డయాలసిస్ చేయించడం కంపల్సరీ అని చెప్పారు. దీంతో వారానికి మూడు రోజులు హాస్పిటల్ కు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. బలగం డైరెక్టర్ వేణు కొంత సాయం చేసినా.. అన్ని రకాల ట్రీట్‌మెంట్, మందుల కోసం దాదాపు రూ.8 లక్షలు అవసరమవుతాయని కొమురమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

# స్కూటీని ఢీకొన్న రాజధాని బస్సు

## మంటల్లో బస్సు, స్కూటీ దగ్ధం : ఘటనలో ఒకరు మృతి

**సూర్యాపేట,మార్చి30(ప్రజామంటలు):** సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఇందిరానగర్ వద్ద రాజధాని బస్సు ప్రమాదానికి గురైంది. మియాపూర్ నుండి విజయవాడ వెళ్తున్న రాజధాని బస్సు ఎదురుగా వెళుతున్న స్కూటీని ఢీకొంది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై ప్రయాణికులు హుటా హుటిన కిందకు దించేశాడు. దీంతో తృటిలో ప్రమాదం



తప్పింది. బస్సు స్కూటీని ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. స్కూటీ, బస్సు పూర్తిగా దగ్ధం కాగా.. ఒకరు మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా సురక్షితంగా ఉన్నారు. మృతుడు ఇందిరానగర్‌కు చెందిన రాజు(45)గా గుర్తించడం జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు రాజధాని బస్సు వెళుతోంది. మియాపూర్ డిపోకు చెందిన బస్సుగా గుర్తించారు. మునగాల మండలం మొద్దుల చెరువు దగ్గర ఘటన జరిగింది. కాగా.. నిన్న ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులో సైతం ప్రమాదం జరిగింది. వరుస ఘటనలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.. ప్రమాదంతో నడిరోడ్డుపై బస్సు నిలిచిపోవడంతో ఎన్‌హెచ్-65పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా ఈ ప్రమాదంలో బైక్ వెళ్తున్న రాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని వెంటనే సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతి చెందినట్టు వైద్యులు తెలిపారు

# చెట్టును ఢీకొన్న ట్రక్కు

## ప్రమాదంలో డ్రైవర్,క్లీనర్ మృతి

**జగిత్యాల,మార్చి30(ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మార్బుల్ లోడుతో నిజామాబాద్ వైపు వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ట్రక్కు డ్రైవర్, క్లీనర్ మృతిచెందారు. మృతులు పంజాబ్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. విషయం తెలియగానే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





# సాయిబాబా ఆలయంలో ఘనంగా సీతారాముల కళ్యాణం

**హైదరాబాద్ మార్చి 30( ప్రజా మంటలు):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని గోల్నాక సాయిబాబా మందిరంలో శ్రీ సీతారామ కళ్యాణ ఉత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి నేత్రనంద భరితుల య్యారు కళ్యాణ అనంతరం నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు ఆశీర్వచనము కళ్యాణ అక్షితలు అంద జేశారు. అన్నప్రసాదం వితరణ చేశారు.కాటం యాదయ్య, రామరాజు, బోనగిరి. సురేందర్, సంతోష్ కుమార్, కొలిపాక రవీం దర్ దంప తులు, శ్రీనివాస్ దంపతులు, వైదిక క్రతువులు సిరిసిల్ల, రాంప్రసాద్ శర్మ, గుండి. యశస్వి శర్మ ,రామొజ్జుల. విజయ్ కుమార్,సిరిసిల్ల రాజేంద్ర శర్మ, తదితరులు నిర్వహించారు .అదే విధముగా గడ్డి అన్నారంలో అపార్ట్మెంట్‌లో కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై సాంప్ర దాయ బద్ధంగా అలంకరించి కళ్యాణ వేడుకలను నిర్వహించారు.





# నిరుద్యోగ యువతపై ఎందుకీ నిర్లక్ష్యం

## పేపర్ లీకేజీపై చర్యల్లో శ్రద్ధ ఏదీ

## కవిత కేసుపై ఉన్న మమకారం ప్రజలపై ఉండదా

## కెసిఆర్ తీరుపై ఎంపి ధర్మపురి అర్వింద్ విమర్శలు

**నిజామాబాద్,మార్చి30(ప్రజామంటలు):** ఒకపక్క ముప్పై లక్షలమంది నిరుద్యోగ యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తూ పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకై రాష్ట్రం అట్టుడుకుతుంటే స్పందించని ముఖ్యమంత్రి కేసీఆర్, రాహుల్ విషయంలో మాత్రం వెంటనే ఎందుకు స్పందిస్తున్నారని బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు నిరుద్యోగుల గోస కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాయా అని ప్రశ్నించారు. అదే లిక్కర్ స్కామ్ విషయంలో కవిత ప్రమేయంపై ఎందుకు స్పందించడం లేదని అన్నారు. గతంలో, ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, కొండగట్టు బస్సు ప్రమాదంలో భక్తులు మరణించి నప్పుడు కూడా స్పందించలేదన్నారు. రోజుకు ఒకరిద్దరి చొప్పున రైతులు ఆత్మహత్యలు చేసుకొని రాలిపోతున్నప్పుడు, ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పుడు... కూడా స్పందించని కేసీఆర్ ఇవాళ రాహుల్ గాంధీ విషయంలో అంత వేగంగా స్పందించారంటే ఆయనకు రాజకీయ ప్రాధాన్యమే ముఖ్యమని అర్థం చేసుకోవాలన్నారు. గతంలో డిప్యూటి సిం రాజయ్య, మంత్రి ఈటెల రాజేందర్ లను తప్పించినప్పుడు విలువలు ఏమయ్యాయని అన్నారు. రాష్ట్రంలో నిత్యం బీజేపీతో సహా విపక్షాల కార్యకర్తలపైన, నాయకులపైన అక్రమ కేసులు బనాయించటం, ప్రశ్నించే గొంతుకలను జైలుపాలు చేయడం ప్రజాస్వామ్య అవుతుందా అని ఆయన ప్రశ్నించారు. కేంద్రంపై విమర్శలు చేయడం మినహా సాధించేందేమీ లేదన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో



ఆలోచించి ప్రజల కోణంలో ఆలోచించాలన్నారు. పేపర్ లీకేజీలో దోషులపై చర్యలకు పూనుకోవాలన్నారు. ప్రభుత్వం గత ఎనిమిదిన్నరేళ్లుగా ప్రజల ఆశయాల, ఆకాంక్షలకు విరుద్ధంగా పరిపాలన సాగిస్తున్నది. లాకప్ డెత్‌లు, నిరుద్యోగుల రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వ మద్యం వ్యాపార మరణాలు, ధరణి గందరగోళం, కొంతమంది ప్రజాప్రతినిధుల భూదందాలు, ఇసుక భూమి మైనింగ్ మాఫియాలు, వాటితో సంబంధం ఉన్న హత్యలు, స్త్రీలపై అఘాయిత్యాలు... ఇవన్నీ రాష్ట్రంలో అవినీతిమయ, అసమర్థ పాలనకు పరాకాష్ఠగా నిలుస్తున్నా ప్రజాస్వామ్యం గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యంగా ఇటీవల వెలుగు చూసిన టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం నిరుద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం మాత్రం గత నాలుగేళ్ళుగా కాలయాపన చేస్తూ ఎన్నికల ముందు కేవలం 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. తమ బిడ్డలకు ఉద్యోగాలు లభిస్తాయని ఎదురుచూస్తున్న లక్షలాది పేద కుటుంబాలకు ఒక పిడుగుపాటు వలె పేపర్ లీకేజి దాపురించింది. అనేక విషయాలలో ప్రభుత్వం నిజాయితీని కోల్పోయిందన్నారు. గతంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన అవకతవకల వల్ల అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నో సందర్భాల్లో అనేక ఘటనలు జరిగినా స్పందించని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇప్పుడు కవిత విషయంలో నోరు పారేసుకుంటు న్నారని ధర్మపురి మండిపడ్డారు.

మద్యం కుంభకోణం ఆరోపణలను ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత పట్ల చూపించిన సానుభూతి నిరుద్యోగులు, విద్యార్థుల పట్ల చూపించకపోవడం దురదృష్టకరం అన్నారు.

## గోల్నాక సాయిబాబా ఆలయంలో, సాయి కృప లేక్ వ్యూ రెసిడెన్సిలో

# ఘనంగా సీతారాముల కళ్యాణం



**హైదరాబాద్ మార్చి 30(ప్రజా మంటలు):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని గోల్నాక సాయిబాబా మందిరంలో శ్రీ సీతారామ కళ్యాణ ఉత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి నేత్రానంద భరితుల య్యారు. కళ్యాణ అనంతరం నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వితరణ తో పాటు ఆశీర్వచనము కళ్యాణ అక్షితలు అందజేశారు. అన్నప్రసాదం వితరణ చేశారు.కాటం యాదయ్య, రామరాజు, బోనగిరి. సురేందర్, సంతోష్ కుమార్, కొలిపాక రవీందర్ దంపతులు, శ్రీనివాస్ దంపతులు, పాల్గొన్నారు. వైదిక క్రతువులు సిరిసిల్ల, రాంప్రసాద్ శర్మ, గుండి. యశస్వి శర్మ ,రామొజ్జుల. విజయ్ కుమార్,సిరిసిల్ల .రాజేంద్ర శర్మ, తదితరులు నిర్వహించారు .అదే విధముగా గడ్డి అన్నారంలో సాయి కృప లేక్ వ్యూ రెసిడెన్సి అపార్ట్మెంట్ లో కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు పార్థసారథి, పద్మనాభరావు సుబ్రహ్మణ్యం, రవీందర్ రావు, సాంబశివరావు, శ్యాం కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై సాంప్రదాయ బద్ధంగా అలంకరించి కళ్యాణ వేడుకలను నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

# వేములవాడలో వైభవంగా సీతారామకళ్యాణం

## శివుడిని వివాహమాడిన జోగినులు

**వేములవాడ,మార్చి30(ప్రజామంటలు):** వేములవాడ రాజన్న సన్నిధిలో సీతారాములు కల్యాణ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా సాగింది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలో శ్రీ రామ నవమిసందర్భంగా సీతారాముల కల్యాణం వేదపండితుల మంత్రో చ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాలు, వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. విష్వక్సేన పూజతో మొదలై ఆగమ శాస్త్ర ప్రకారం సాంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. రాముడు అవతరించిన ఈ చైత్రశుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రం అభిజిత్ లఘ్నంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకను చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు లక్షా 50 వేలకు పైగా భక్తులు తరలి వచ్చారు. రాజన్న ఆలయం తరఫున ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, అధికారులు, మున్సిపల్ తరఫున చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు పట్టువస్త్రాలను అందజేశారు. వేడుకలో వేములవాడ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్‌బాబు, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, జిల్లా జడ్జి ప్రేమలత,ఆర్డీవో పవన్‌కుమార్ పాల్గొన్నారు. రాములోరి కల్యాణ వేడుకను వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి హిజ్రాలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సీతారాముల



కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. రాములోరి కల్యాణ వేడుక అనంతరం హిజ్రాలు తాళి కట్టుకున్నారు. ఒకరికొకరు తలంబ్రాలు పోసుకుంటూ అందరి దృష్టిని ఆకర్షించారు.

# దహీ వివాదంపై వెనక్కి తగ్గిన కేంద్రం

## కర్డ్ ప్యాకెట్‌పై దహీ పేరుపై యూటర్న్

**చెన్నై,మార్చి30(ప్రజామంటలు):** తమిళ నాట ఆందోళనలతో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ వెనక్కి తగ్గింది. తాజాగా గురువారం ఆ ఆదేశాలను వెనక్కు తీసుకుంటున్నట్లు ఫసీ తెలిపింది.




పెరుగు ప్యాకెట్లపై కర్డ్ పేరుతో పాటు బ్రాకెట్‌లో దహీ, తయిర్, మోసారు వంటి ప్రాంతీయ భాషలను వినియోగించ వచ్చని తెలిపింది. ఇటీవల తమిళనాడు మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్కు 'పెరుగు' పేరుపై ఫసీ ఈ ఏడాది జనవరిలో కొన్ని ఆదేశాలు జారీ చేసింది. పెరుగు ప్యాకెట్లపై ఆంగ్లంలో ఉన్న 'కర్డ్' , తమిళంలో ఉన్న 'తయిర్' పేర్లను తొలగించి.. 'దహీ' అని హిందీలోకి మార్చాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

ఈ ఆదేశాలపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందీని బలవంతంగా రుద్దాలనే వారి పట్టుదల మరింత పెరుగుతోందని, చివరకు పెరుగు ప్యాకెట్‌పైనా తమ మాతృభాషలో ఉన్న పేరును మార్చేసి హిందీలో రాయమని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతృభాషల పట్ల ఇలాంటి నిర్లక్ష్యం పనికిరాదని, దీనికి బాధ్యులైన వారిని దక్షిణాది శాశ్వతంగా బహిష్కరిస్తుందని స్టాలిన్ ధ్వజమెత్తారు. అలాగే ఫసీ నిర్ణయాన్ని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య 'ఆవిన్ ' కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. తాము 'దహీ' అనే పేరును వినియోగించ బోమని స్పష్టం చేసింది. వచ్చే ఆగస్టులోగా ఈ ఆ ఆదేశాలను అమలు చేయాలని తమ ప్రభుత్వానికి లేఖ అందిందని పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ఎం. నాజర్ తెలిపారు. హిందీకి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. తమిళనాడుతో పాటు కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు కూడా ఇలాంటి ఆదేశాలు పంపినట్లు సమాచారం.

## 'బలగం' సినిమా 'కొమురయ్య' పాత్రధారునికి సన్మానం

**భీమదేవరపల్లి మార్చి 30 (ప్రజామంటలు):** బలగం చిత్రంలో కొమురయ్య పాత్రధారుడు కేతిరి సుధాకర్ రెడ్డిని కొప్పూర్ హనుమత్పురి పంచముఖ ఆంజనేయ



స్వామి ఆలయంలో ఘనంగా సత్కరించారు. సుధాకర్ రెడ్డి గతంలో ముల్కనూర్ శిశు మందిర్ విద్యాలయంలో ఆచార్యునిగా పనిచేశారు. దీనితో పూర్వ విద్యార్థులు, గ్రామ సర్పంచ్ గద్ద రాజమణి సమ్మయ్య, ఆలయ చైర్మన్ కాసం రమేష్, జ్ఞానేశ్వర్ తదితరులు ఘనంగా సత్కరించారు.

## ఘనంగా శ్రీ రామనవమి వేడుకలు

### పట్టువస్త్రాలను అందజేసిన ఎమ్మెల్యే దంపతులు

**మెట్ పల్లి మార్చి 30 (ప్రజామంటలు):** పట్టణంలోని శ్రీ కొదండ రామాలయంలో శ్రీ రామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులను ఖాదీ ఆవరణలోని హనుమాన్ ఆలయం నుంచి






ఎదుర్కొలుగా శ్రీ కోదండ రామాలయానికి తీసుకొచ్చి అంగరంగ వైభవంగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్రావు - సరోజన దంపతులు కల్యాణంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలను అందజేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఆర్డీవో వినోద్ కుమార్- సుజాత దంపతులతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ రాణవేని సుజాత సత్యనారాయణ దంపతులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం లయన్స క్లబ్ ఆధ్వర్యంలో త్రాగునీరును ఏర్పాటు చేయగా యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మహాజన్ నర్సింలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బేగంపేట కేసరి హనుమాన్ ఆలయంలో సీతారాముల కళ్యాణం

**సికింద్రాబాద్ మార్చి 30 (ప్రజామంటలు):** సనత్ నగర్ నియోజకవర్గం బేగంపేట్ కేసరి హనుమాన్ దేవాలయం లో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీసీతారామల వారి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితులు



శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువు దీరిన శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని జరిపించారు. ఈసందర్బంగా వేలాది మంది భక్తులు శ్రీస్వామివార్ల కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కేసరి హనుమాన్ ఆలయ చైర్మన్ నరేందర్ నాయి, ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు కాంచనమాల ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నయనానందకరం శ్రీ సీతారామ కళ్యాణం

(రామ కిష్టయ్య సంగన భట్ల)

**ధర్మపురి మార్చి 30 (ప్రజామంటలు):** ధర్మపురి పట్టణంలో గురువారం రామజన్మోత్సవ, రామ కల్యాణోత్సవ వేడుకలు వైభవోపేతంగా, కన్నుల పండువగా జరిగాయి. ధర్మపురి క్షేత్రంలో గోదావరి తీరాన వెలసిన శ్రీరామాలయంలో ఉదయం శ్రీరామ జన్మో త్సవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన వంశపారంపర్య అర్చకులు తాడూరి బాలకిష్టయ్య శర్మ, బలరామ శర్మ, బాలచంద్రశర్మ, రఘునాథ శర్మ, వామనశర్మ, రామశర్మ, శరచ్చంద్ర శర్మ, ఆశ్రిత్ శర్మ, విలోక్ శర్మ, బాలకృష్ణ శర్మ, భరత్ శర్మల ఆధ్వర్యంలో విధివిధాన వేదోక్త సంప్ర దాయ పూజలొనరించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వస్తి పుణ్యాహవాచనం, వామదేవ శతానంద రుత్విగ్వ రణం, కళ్యాణార్థం వివాహ వేదిక ప్రవేశం, శ్రీరామచంద్ర వరునికై కన్యా న్వేషణ, సీతారామ వంశావళి ప్రవరలు, మధుపర్క ప్రాశనం, సముహూర్త, మంగళ సూత్రధారణం, అక్ష తారోపణం, వివాహానంతర లఘు పూజ, నైవేద్యం, మహామంత్ర పుష్పం, దేవతాశీర్వచనం తదితర ప్రత్యేక కార్య క్రమాలను నిర్వహించారు. సర్వాలంకార శోభితులై, పుష్ప మాలాలంకృతు లైన శ్రీరామచంద్రునికి, పరమపావని యైన లోకమాత సీతాదేవికి లోకకల్యా కల్యాణార్థం అభిజిత్ లగ్న శుభ ముహూ ర్తంలో మధ్యాహ్నం మూల విరాట్టులకు జరిపించిన కల్యాణ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు హాజరై కన్నులారా గాంచి తరించారు. రామాలయంలో వేదవిదులు మధు శంకర శర్మ, కొరిడే విశ్వనాథ శర్మ, మధు రామ శర్మ, భరత్ శర్మ, ప్రసాద్ శర్మ తదితరులు కల్యాణోత్సవాన్ని జరిపించారు.

**పట్టు వస్త్రాల సమర్పణ:**

ధర్మపురి దేవస్థానం పక్షాన ముత్యాల తలంబ్రాలు పట్టువస్త్రాలు ప్రతి సంవత్సరము వలె ఈ సంవత్సరముకూడ అందజేయటం జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సంకటాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ , ముత్యాల శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాస్, రెనవేషన్ కమిటీ అధ్యక్షులు ఇందారపు రామన్న, సభ్యులు అక్కనపల్లి సురేందర్, వేముల నరేష్, చుక్కరవి, గునిశెట్టి రవీందర్, స్తంభంకాడి మహేష్, వీరవేణి కొమురయ్య, ఇనుగంటి రమ , సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

**లక్ష్మీ నరసింహ కాలనీలో....**

ధర్మపురి పట్ట ణంలో శ్రీలక్ష్మీ నరసింహా స్వామి కాల నీలో నిర్మితమైన



శ్రీరామాలయంలో వేద పండితులు కాసర్ల వంశీ కృష్ణ, కషోజ్జల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం నుండి వేదోక్త స్మార్త సంప్రదాయరీతిలో ప్రత్యేక పూజలు చేశారు.. కమిటీ అధ్యక్షుడు దివిటీ పరమేశ్వర్ పర్యవేక్షణలో శ్రీరామునికి, సీతాదేవికి లోకకల్యాణార్థం జరిపించిన కల్యాణ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు హాజరై కన్నులారా చూసి తరించారు.

**దేవస్థానంలో....**

ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో సీతారామ, లక్ష్మీ నరసింహ స్వాముల కల్యాణ వేడు కలు ఒకే వేదికపై ఒకే మహూర్తాన కన్నుల పండువగా జరిగాయి, మునుముందుగా దేవస్థానం ఈఓ శ్రీనివాస్, కమిటీ చైర్మన్ రామయ్య, సభ్యులు, ఉప ప్రధానార్చకులు నేరెళ్ళ శ్రీనివాసాచార్య,. ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్య, ఆస్థాన వేద పండితులు రమేశ శర్మ, ముత్యాల శర్మ తదితరులు కల్యాణ మూర్తులను వేద మంత్రాలతో, మంగళ వాద్యాలతో, శేషప్ప కళా వేదికపైకి తీసుకొచ్చి, శోడశోపచార సహిత పూజలతో, సాంప్రదాయ బద్ధంగా కల్యాణం జరిపించారు.

**తిమ్మాపూర్ లో....**

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పరిధిలోని తిమ్మాపూర్ రామాలయంలో రామ జన్మ, కళ్యాణ వేడుకలకలను బ్రహ్మోత్సవాలలో బాగంగా నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాసా చార్య, బొజ్జా రాజ గోపాల్ శర్మ, కిరణ్, అరుణ్, విజయ్, మోహన్ కళ్యాణం జరిపించారు. రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు తనయులు నర్సింగ్ రావు దంపతులు, కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే జైనా, దొంతాపూర్, గండి హన్మాన్ ఆలయాల్లో సీతారామ కళ్యాణ వేడుకలు నిర్వహించారు

**సాయి జన్మ దిన వేడుకలు:**

ధర్మపురి క్షేత్రస్థ గోదావరీ నదీ తీరస్థ శ్రీసాయి బాలాజీ మందిరంలో సాయిబాబా జన్మదిన వేడుకలు వైభ వంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక నిర్మాత ఒజ్జల ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో, ట్రస్టు అధ్యక్షుడు గోలి రాంప్రసాద్ నిర్వహణలో, అర్చకులు, స్థానిక వేద పండితులు ఆకర్ష్ శర్మ, అక్షయ్ శర్మలు, ప్రత్యేక పూజలు, జన్మదిన అర్చనలు నిర్వహించారు. మహా క్షీరాభిషేక కార్యక్రమంలో అశేష భక్తజనులు స్వహస్తాలతో, సాయినాథున్ని క్షీరాభిషిక్తుడిని చేసి తరించారు. ఈ సందర్భంగా నివేదనలు సమర్పించారు.

## సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్సీ కవిత పట్టువస్త్రాల సమర్పణలు

**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** శ్రీ రాముని కల్యాణానికి ఎమ్మెల్సీ కవిత తరుపున జగిత్యాల జిల్లాలోని పలు దేవాలయాలకు పట్టు వస్త్రాలు అందించి, అన్నదాన కార్యక్రమం చేయించారు.

**కొండగట్టు ఆంజనేయ స్వామికి:**

శ్రీ రామ నవమి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి వారికి ఎమ్మెల్సీ కవిత అందించిన పట్టు వస్త్రాలు మల్యాల ఎంపీపీ మిట్ట పెల్లి విమల సుదర్శన్, జడ్పిటిసీ కొండపల్కల రామ్మోహన్ రావ్,సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి సమర్పిం చారు. జగిత్యాల జిల్లా యూత్ అధ్యక్షుడు దావ సురేష్, ఆలయ పాలక మండలి సభ్యులు,అర్చకులు పాల్గొన్నారు.



**జగిత్యాల కోదండ రామాలయంలో.....**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంపు కోదండ రామాలయం, విద్యానగర్ రామాలయంలో ఎమ్మెల్సీ కవిత అందించిన పట్టు వస్త్రాలు సమర్పించి అన్నదాన కార్యక్రమాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రారంభించారు.

**మల్లాపూర్ మండలం వాల్గొండలో.**

కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలం వాల్గొండ రామ లింగేశ్వర ఆలయంలో ఎమ్మెల్సీ కవిత అందించిన పట్టు వస్త్రాలు సమర్పించి అన్నదాన కార్యక్రమం జిల్లా అధ్యక్షులు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు ప్రారంభించగా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా డిఈఓ ఇచ్చిన అక్రమ పోస్టింగ్

- చర్యలు తీసుకోవాలని కోరిన ఎస్.టి.యు. ఉపాధ్యాయ సంఘం

**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** 20 యేళ్లు తన ఉద్యోగానికి గైర్హాజర్ అయిన ఉపాధ్యాయునికి నిబంధనలకు విరుద్ధంగా తిరిగి అక్రమ పోస్టింగ్ ఇచ్చిన జగిత్యాల డిఇఓ పై తగు చర్య తీసుకోవాలని కోరుతూ ఎస్.టి.యు. ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. 20 ఏళ్లు పాఠశాల విధులకు దూరంగా ఉన్న ఉపాధ్యాయునికి తిరిగి పోస్టింగ్ ఇచ్చిన జగిత్యాల డి.ఇ.ఓ. పై లోతైన విచారణ జరపాలని ఎస్టియు జిల్లా శాఖ మిమ్మల్ని కోరుతున్నది. ఐదు సంవత్సరాల పైబడి గైర్హాజర్ అయిన ఉద్యోగి వివరాలు ప్రభుత్వానికి తెలపాల్సిన బాధ్యతలో ఉన్న ఈ ఉన్నతాధికారి 20 ఎండ్ల తర్వాత వచ్చిన సదరు ఉద్యోగి నియామకానికై ఫైల్ పెట్టడాన్ని ఎస్టియు తప్పుపడుతున్నది. ఇసిసిఏ సర్వీసు రూల్స్ కు విరుద్ధంగా ఉంది. కావున రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు త్రోవ పట్టించిన ఈ అక్రమ నియామక అంశంపై లోతైన విచారణ జరిపి బాధ్యులైన విద్యాశాఖ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్.టి.యు. సంఘం పక్షాన వినతి పత్రంలో కోరారు. ఒకవేళ పైనియామక ప్రక్రియ న్యాయబద్ధంగా, సిసిఏ నిబంధనలకు లోబడి చేపట్టినట్టు తమరి విచారణలో తేలితే గతంలో 6 సంవత్సారాలు పైబడి తమ విధులకు గైర్హాజర్ అయి



ఉద్యోగం నుంచి తొలగించి వేయబడ్డ ఉద్యోగ ఉపాధ్యాయులందరిని విధుల్లో చేర్చుకొని వారి కుటుంబాలను ఆదుకోవాలని తమరిని కోరుతున్నాము.

## కన్నుల పండువగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం

**గొల్లపల్లి మార్చి 30 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలను గురువారం కన్నుల పండుగగా నిర్వహించారు మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరాములపల్లె లోని శ్రీ దుర్గా భవాని చిలువాకోడూర్ లోని శ్రీ రామలింగేశ్వర స్వామి చందోలి లోని శ్రీ సాయి ఆలయంలో లోతునూ రులోని శ్రీ రాజరాజేశ్వర స్వామి రాఘవపట్నం లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలను అశేష భక్తజన సందోహం మధ్య వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలతో సీతారాముల ఉత్సవ విగ్రహములను పెళ్లి దుస్తుల అలంకరించి ఆలయ పూజారుల వేద మంత్రోచ్చారణల నడుమ కళ్యాణ మహోత్సవ ఘట్టాలను కన్నుల పండుగల నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సీతారాముల భక్తుల నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. అంజన్న




భక్తుల భజన సంకీర్తనలతో భక్తి భావం వెల్లివిరిసింది. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో శ్రీ మదరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిని



## బౌద్ధనగర్ డివిజన్‌లో శ్రీ సీతారాములోరి కళ్యాణ వేడుకలు

**సికింద్రాబాద్ మార్చి 30 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్ డివిజన్ లో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఆయా ఆలయాల్లో శ్రీసీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు ఘనంగా



నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్ళి పూజలు చేశారు. బౌద్ధనగర్ రామాలయం, అశోక్ నగర్ హనుమాన్ టెంపుల్, అంబర్ నగర్ హనుమాన్ ఆలయాల్లో జరిగిన శ్రీసీతారాముల వారి కళ్యాణోత్సవ వేడుకల్లో డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, నాయకులు కంది నారాయణ, శ్రీకాంత్, రాజేశ్, సాయి యాదవ్, మానస పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**ఇబ్రహీంపట్నం మార్చి 30 (ప్రజామంటలు):** మండలంలో పలు దేవాలయాలలో సీతారామ చంద్రుల వారి కళ్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. చలువ పందిళ్ళు, పచ్చని తోరణాలు, భాజ భజంత్రీలు, మంగళ





వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య గురువారం సీతారాముల కళ్యాణం వైభోపేతంగా జరిగింది. ఇట్టి కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొన్ని దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ లు నేమూరి లతా సత్యనారాయణ, దొంతుల శ్యామల తుకారాం, ఎంపీటీసీ పొన్నకంటి చిన్న వెంకటి, మాజీ జెడ్పిటిసి జేఎన్ సునీత వెంకట్, కల్వకుంట్ల సుజిత్ రావు, మరియు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కనులవిందుగా సీతారాముల కళ్యాణం

**ఎల్కతుర్తి మార్చి 30 (ప్రజామంటలు):** గ్రేటర్ వరంగల్ హనుమకొండ లోని రెడ్డి పురం విజయలక్ష్మి కాలనీలో గురువారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం



వైభవంగా జరిగింది ఈ కళ్యాణ మహోత్సవం కార్యక్రమానికి విజయలక్ష్మి కాలనీ వాసులు భక్తి శ్రద్ధల తో పాల్గొన్నారు. వేద మంత్రంల చేత వేద పండితులచే శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది ఈ మహోత్సవ కార్యక్రమానికి కాలీ లోనే దాదాపు 300 మంది భక్తులు పాల్గొని కన్నుల విందుగా తిలకించారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమం శ్రీ పద్మ భక్తురాలు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో శ్రీ శ్రీనివాసరావు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి కాలనీ అభివృద్ధి కమిటీ ప్రముఖులు, భక్తులు హాజరై కళ్యాణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు

**జగిత్యాల మార్చి 30 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని ధరూర్ క్యాంపు కోదండ రామాలయంలో మరియు ఎడ్లంగడి రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి సీతారాముల పరివార విగ్రహాలచే కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేష





సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు కళ్యాణ అక్షింతలు ఆశీర్వచనం అందజేశారు. ధరూర్ క్యాంపు కోదండ రామాలయంలో మరియు ఎడ్లంగడి రామాలయంలో పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దంపతులు అందజేశారు. మార్కండేయ మందిరంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తో పాటు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో శ్రీరామ మందిరంలో, చిన్న గట్టు ఆంజనేయస్వామి ఆలయంలో, శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నగట్టు ఆలయాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## బి.సి.ల హక్కుల సాధనకై "ఛలో ఢిల్లీ" విజయవంతం చేయండి


**కోరుట్ల మార్చి 30 (ప్రజామంటలు):** ఏప్రిల్ 4, 5 తేదీలలో ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి.సి. యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... బి.సి. ల పట్ల కేంద్ర ప్రభుత్వము అవలంబిస్తున్న వైఖరికి



నిరసనగా ఈ కార్యక్రమం చెప్పట్టినట్టు రాజ్యసభ సభ్యులు, బి.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణన్న పిలుపు మేరకు చట్ట సభల్లో బి.సి. లకు 50 శాతం రిజర్వేషన్ లు కల్పించాలని, బి.సి. బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాలని, కేంద్రంలో బి.సి. లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ప్రధానమైన డిమాండ్లతో ఢిల్లీ లో నిర్వహించబడిన కార్యక్రమా నికి రాష్ట్ర వ్యాప్తంగా బి.సి. లు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.పార్టీలకి అతీతంగా బి.సి. లు ఏకమై రాజ్యాంగ దిశగా హక్కులు సాధించుకునేందుకు నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి. యువజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మన పెల్లి రాజేంద్ర ప్రసాద్, బి.సి. యువజన సంఘం నాయకులు తోగిటి లక్ష్మణ్, ఇందూరి నరేష్, వెగ్యారపు అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారామ స్వామి కళ్యాణం

**కోరుట్ల మార్చి 30 (ప్రజామంటలు):** రాముడు మర్యాద పురుషోత్తముడు, పితృ వాక్య పరిపాలకుడు, మాట తప్పనివాడు ప్రజా రంజకుడు అలాంటి రాముల వారికి ఆనాడు మిథిలానగరంలో జనక మహారాజు, వశిస్టుల వారి సమక్షంలో



జరిగిన వేడుక నేడు కోరుట్ల పట్టనములోని అతిపురాతన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ రామ నవమి సందర్బంగా సీతారాముల కళ్యాణం వైభవోపేతంగా జరిగింది. దేవాలయ ప్రధాన అర్చకులు బీర్నంది భాను మూర్తి ఉదయం మూల విరాట్టుకు ఫల పంచామృతాలతో అభిషేక, అర్చనలు చేశారు. కళ్యాణంలో భాగంగా భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రామయ్య సీతమ్మ మెడలో మాంగళ్య దారణ గావించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బీర్నంది శ్రీనివాస్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కమనీయం.. కడు రమణీయం
# శ్రీ సీతారాముల కళ్యాణం

- **తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన గ్రామ పాలకవర్గం**

**వేలేరు మార్చి 30 (ప్రజామంటలు):** సిరి కళ్యాణపు బొట్టును పెట్టి.. మణి బాసికమును నుదుటను కట్టి.. పారాణిని పాదాలకు పెట్టి..



పెళ్ళికూతురై వెలసిన సీతమ్మ తల్లిని.. సంపగి నూనెను కురులను దువ్వి%ా% సొంపుగ కస్తూరి నామము దీర్చి%ా% చెంపజవాజి చుక్కను పెట్టి.. పెళ్ళికొడుకై వెలసిన రామయ్య తండ్రిని చూసేందుకు రెండు కన్నులు చాలవెమో.. అనిపించే విధంగా అంగరంగ వైభవంగా వేలేరు మండలంలోని రుద్ర రామేశ్వర ఆలయంలో సర్పంచ్ కాయిత మాధవరెడ్డి,ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిపించారు. గ్రామ పాలకవర్గం తరుపున స్వామి వారికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ అశేష భక్త జనులు మధ్య శ్రీ సీత రాముల కల్యాణం లగ్న ముహూర్తన పండితులు పరమేశ్వర్ శర్మ మేళతాలల మధ్య రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించరని, కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహిళలు




అమ్మవారికి ఒడిబియ్యం, కట్న కానుకలు సమర్పించారని వేద పండితులు భక్తులందరిని స్వామివారి అక్షింతలు వేసి తీర్ధ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారని, కళ్యాణం అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని సీతారాములను వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యావంతులు, వేద పండితులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కైలాస కళ్యాణి క్షేత్రములో సీతారాముల కళ్యాణం

- **హాజరైన పీవీ కుటుంబ సభ్యులు**

**భీమదేవరపల్లి మార్చి 30 (ప్రజామంటలు):** మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.స్వస్థలం వంగర కైలాస కళ్యాణి దేవాలయంలో గురువారం శ్రీ సీతారాముల కళ్యాణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సరిగ్గా భద్రాద్రి సీతారాముల కళ్యాణం జరిగిన సమయంలో వంగరలో ఈ వేడుకను బ్రహ్మశ్రీ అంజన్న శర్మ, లింగరాజ్ పండిట్ శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వంగర గ్రామం నుండే కాక పొరుగు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి. సంధ్య మదన్ మోహన్, పి.వి. కిరణ్, సర్పంచ్ రజిత గోపాల్ రెడ్డి, చిదురాల అర్జున్, బింగి మధు, ఊసకోయిల ప్రకాశ్, శ్రీరామోజ మొండయ్య, ఆర్. వెంకటరెడ్డి, ఎంపిటిసి కౌసల్య వీరారెడ్డి, సతీష్ రెడ్డి, డా.క్రిష్ణం రాజు, ఉపసర్పంచ్ రాజు, బుచ్చిరెడ్డి, శ్రీరామోజు శ్రీను, తిరుపతి రెడ్డి, మారం సతీష్, మల్లారెడ్డి, కొండల్ రెడ్డి, బత్తిని అశోక్, కండె రమేశ్, చక్రపాణి, జిన్నారపు కుమార్, కల్యాణి, రామరపు పద్మ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మహిళల కోలాటాలు, డప్పు వాయిద్యాల మధ్య బింగి మధు ఇంటినుండి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. బిజెపి నాయకులు జన్నపురెడ్డి



సురేందర్ రెడ్డి తమ కార్యకర్తలతో వచ్చి రాములవారిని సందర్శించి ఆశిస్సులు పొందారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## చనిపోయిన రాజు కుటుంబానికి ఆర్థిక సహాయం

- **కూతురు సౌజన్య చదువుకు సహకరిస్తా**
- **జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సుగుణకర్ రాజు**

**స్టేషన్ ఘన్ పూర్ మార్చి 30 (ప్రజామంటలు):** ఇది ఒక హృదయ విదారక ఘటన. 15 రోజుల్లో అనారోగ్యంతో ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోయారు. 10 రోజుల క్రితం కొడుకు చనిపోగా, ఆ తర్వాత మూడు రోజుల తండ్రి ప్రాణాలు విడిచాడు. వివరాలు.... జనగామ జిల్లా స్టేషనఘన్ పూర్ మండలం తానేదర్ పల్లి గ్రామానికి చెందిన మాచర్ల రాజు గత సంవత్సరం నుంచి కాలేయం వ్యాధితో బాధపడుతూ మొన్న మూడు రోజుల క్రితం మరణించారు. కాగా అవసరమయ్యే సమయం లోనే తనతోపాటు కొడుకు శ్రీరామ్ బోన్ కాన్సర్ తో దాదాపు రెండు సంవత్సరాలుగా నరకయాతన అనుభవిస్తూ 10 రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుగుణాకర్ రాజు చలించిపోయి అక్కడికి చేరుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కూతురు సౌజన్యకు ఆర్థిక సహాయం చేశారు. సౌజన్య ఉన్నత చదువులకు సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన



మండల పార్టీ అధ్యక్షులు మాచర్ల గణేష్, మార్కెట్ వైస్ చైర్మన్ చల్లా చందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న భగవద్గీత పఠన శిక్షణ తరగతులు

**జగిత్యాల మార్చి 30 (ప్రజా మంటలు):** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం గీతా భవన్ లో గీతా సత్సంగ్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అద్భుతంగా సాగుతున్న శ్రీ భగవద్గీత శిక్షణ పఠన తరగతులు ఈరోజు 13వ రోజుకు చేరాయి. వందలాదిమంది స్త్రీలు ,పురుషులు ఉదయం ట %శీ%చనుగా ఏడు ముప్పై నిమిషాలకు గీతా భవన్ ప్రాంగణం చేరుకుంటున్నారు. గురూజీ చీలమంతుల చత్రపతి భగవద్గీత శ్లోకాల్లోని అర్థాన్ని విడమర్చి చెప్తుంటే, శ్రోతలు మంత్రముగ్ధులై శ్రద్ధగా వింటున్నారు. గురూజీ చత్రపతి గారు 17వ అధ్యాయంలోని, శ్రద్ధాత్రయ విభాగ%శీ% లోని, శ్రీకృష్ణ పరమాత్మ ఉపదేశించిన, అనేక విషయాలను క్షుణ్ణంగా హృదయాలకు హత్తుకునే విధంగా చెబుతున్నారు. ఫలాపేక్ష లేకుండా చేస్తే మోక్షం లభిస్తుందని, సుఖం లభిస్తుందని, ఫలా పేక్ష ఆశిస్తూ చేస్తే , బంధం ఏర్పడుతుందని దుఃఖం కలుగుతుందని, అన్నిటికన్నా గొప్పది బ్రహ్మచర్యం అని శారీరక శ్రద్ధ వృద్ధి పొందుతుంది. మనోనిగ్రహం కలుగుతుందని, బుద్ధి వికసిస్తుందని ,తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో గీతా సత్సంగ్ కార్యదర్శి పామ్ పట్టి రవీందర్, జిడిగే రాము, ఎన్నాకుల ప్రభాకర్ కోటగిరి అశోక్ కుమార్, సామాజిక



కార్యకర్త తవుటు రామచంద్ర%శీ%, పురుషోత్తం, చెట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల మార్కండేయ మందిరంలో పద్మశాలి సేవ సంఘ ఆద్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, బిజెపి నాయకురాలు బోగ శ్రావణి ప్రవీణ్ దంపతులు



## నేడే బిజెపి నూతన కార్యాలయం ప్రారంభం

**జనగామ మార్చి 30 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ.... నేడు శుక్రవారం 31వ తేదిన సూర్యాపేట రోడ్డు నెల్లుట్ల



బైపాస్ వద్ద భారతీయ జనతా పార్టీ నూతన జిల్లా కార్యాలయం వర్చువల్ మీటింగ్ లో భాజపా జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ప్రారంభోత్సవం చేస్తారని అన్నారు. ఈ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్ హాజరవుతారని, జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, బొట్ల శ్రీనివాస్, కర్ర శ్రీనివాస్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## కమణీయం, రమణీయం ... శ్రీరాములోరి కళ్యాణం....

**సికింద్రాబాద్ మార్చి 30 (ప్రజామంటలు):** శ్రీ సీతారాముల కళ్యాణం వాడవాడలా కనులపండువగా అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా పలు ప్రాంతాలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవంలో వేలాది మంది భక్తులు




పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు ఆలయాలను సందర్శించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కళ్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య సుముహుర్తాన శ్రీ సీతారాముల కళ్యాణాన్ని జరిపించారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ బన్సీలాల్ పేట డివిజన్ అరుణ్ జ్యోతి కాలనీలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో పాల్గొన్నారు. ముషీరాబాద్ సర్కిల్ లోని శ్రీ సీతారామచంద్ర స్వామీ ఆలయంలో నిర్వహించిన కళ్యాణంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బన్సీలాల్ పేట కార్పొరేటర్ హేమలత లక్ష్మీపతి, రాంగోపాల్ పేట మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్, పద్మారావు నగర్, బీఆర్ఎస్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు శ్రీహరి, సురేష్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, ముక్క శ్రీను, ప్రవీణ్ రెడ్డి, ప్రేమ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జరిగిన 'సీతారాముల లగ్గం'

**మండలమంతా కళ్యాణ వైభోగమే**

**భీమదేవరపల్లి మార్చి 30 (ప్రజామంటలు):** భీమదేవరపల్లి మండలంలో పలు దేవాలయాలలో సీతారామ చంద్రుల వివాహం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. చలువ పందిళ్ళు, పచ్చని తోరణాలు, భాజ భజంత్రీలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య గురువారం సీతారాముల




కళ్యాణం వైభవోపేతంగా జరిగింది. భీమదేవరపల్లి భీమేశ్వర ఆలయం, గట్ల నర్సింగాపూర్ సీతారామచంద్ర స్వామి ఆలయం, కొప్పూర్ పంచముఖ హనుమాన్ దేవాలయం, ముత్తారం అభయాంజనేయ స్వామి దేవాలయం, కొత్తపల్లి దత్త సాయి క్షేత్రం, ముల్కనూర్ సాంబశివాలయం తదితర గ్రామాలలో భక్తుల సమక్షంలో శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కొప్పూరులో జరిగిన కార్యక్రమానికి వృక్ష ప్రసాద దాత జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి హాజరయ్యారు. కొప్పూరు సర్పంచ్ రాజమణి గద్ద సమ్మయ్య దంపతులు, ఆలయ చైర్మన్ కాసం రమేష్ దంపతులు, ముత్తారంలో శిలగాని విజయ్ కుమార్ అండ్ బ్రదర్స్ దంపతులు పూజలో కూర్చున్నారు.

# ప్రభాస్ ఆదిపురుష్ పోస్టర్ విడుదల

## మళ్లీ యానిమేషన్ లాగే ఉందంటూ ట్రోల్స్



ఈ ఏడాది దేశవ్యాప్తంగా సినిమా ప్రేమికులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న అతి కొద్ది చిత్రాల్లో ప్రభాస్ హీరోగా నటించిన 'ఆదిపురుష్' భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కింది. మొదటిసారి అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ మూవీపై అంచనాలు ఏర్పడ్డాయి. బాలీవుడ్ యువ దర్శకుడు డైరెక్టర్ ఓం రౌత్ డైరెక్షన్ చేసిన ఈ చిత్రంలో సీతగా కృతి సనన్, లంకేశ్‌గా సైఫ్ అలీఖాన్ నటించారు. ఎప్పుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ సినిమాని ప్రపంచవ్యాప్తంగా జూన్ 16న విడుదల చేసేందుకు మూవీ టీం ప్లాన్ చేస్తోంది. నిజానికి.. ఈ మూవీని మొదట సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజ్ చేయాలని చిత్రబృందం భావించింది. అందులో భాగంగా.. సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్, అలాగే టీజర్‌ని విడుదల చేయగా.. యానిమేటేడ్ మూవీలా ఉందంటూ విమర్శలు వచ్చాయి. అలాగే.. వానరులు, సైఫ్ లుక్‌పై సైతం సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగింది. ముఖ్యంగా రావణుడిగా సైఫ్ అయితే తాలిబన్‌లా ఉన్నాడంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. దీంతో వెనక్కి తగ్గిన చిత్రబృందం ప్రస్తుతం ఈ చిత్రాన్ని జూన్ 16న విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, మూవీ రిలీజ్ దగ్గర పడుతున్న కొద్దీ ఈ మూవీ రిలీజ్ గురించి రకరకాల ప్రచారాలు జరిగాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కానందున విడుదల మరోసారి వాయిదా పడుతుందంటూ రూమర్స్ వినిపించాయి. వాటిని కొట్టిపడేస్తూ.. ఓం రౌత్ ఇటీవలే ఓ ట్వీట్ చేశాడు. అందులో జూన్ 16కి ఫిక్సయిపోండని చెప్పాడు. దాంతో.. ప్రభాస్ ఫ్యాన్స్ ఖుషి అయ్యారు. అనంతరం.. శ్రీరామనవమి సందర్భంగా ప్రచార కార్యక్రమాలను ప్రారంభిస్తారనే వార్తలు వినిపించాయి. అనుకున్నట్లుగానే ఓం రౌత్ మార్చి 30న ఓ పోస్టర్‌ని విడుదల చేశాడు. అందులో.. సీత, రాముడు, లక్ష్మణుడు నిలుచుని ఉండగా.. హనుమంతుడు మొక్కుతూ ఉంటాడు. దానికి మంత్రం కన్నా గొప్పది నీ నామం జై శ్రీరామ్' అనే క్యాప్షన్ సైతం రాసుకొచ్చాడు. అది ఇంగ్లిష్, హిందీతో పాటు తెలుగులోనూ రాయడం విశేషం. ఈ పోస్టు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. అయితే.. ఎప్పటిలాగే ఈ పోస్టర్ కూడా ప్రభాస్ ఫ్యాన్స్‌కి అంతగా నచ్చలేదు. దీంతో 'రూ.500 కోట్లు పెట్టి యానిమేటేడ్ మూవీ తీస్తారా'.. 'ఇంతకుముందుకి ఇప్పటికీ ఏ మాత్రం ఇంప్రూవ్‌మెంట్ లేదు'.. 'ఈ పోస్టర్‌కి ఫిల్టర్ ఉపయోగించినట్లు ఉంది. అంతేకానీ ఆర్ట్ వేసినట్లు లేదు'.. 'ఎందుకు రూ.500 కోట్లు వృథా చేస్తున్నావు ఓం రౌత్'.. 'షరా మామూలే. ఏ మాత్రం మారలేదు'.. 'దీనికంటే చిన్న సినిమా హనుమాన్ వీఎఫ్ఎక్స్ బావున్నాయి' అంటూ విమర్శలు చేస్తున్నారు

# శరవేగంగా బాలయ్య చిత్రం షూటింగ్

నందమూరి బాలకృష్ణ ఈ ఏడాది ఆరంభంలో వీరసింహారెడ్డి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతూ ఉంది. బాలయ్య కెరియర్ లోనే హైయెస్ట్ బ్జడెట్ చిత్రంగా ఈ మూవీ తెరకెక్కుతూ ఉండడం విశేషం. ఇదిలా ఉంటే ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తూ ఉండగా యంగ్ బ్యూటీ శ్రీలీల మరో ఇంటరెస్టింగ్ రోల్ లో కనిపించబోతుంది. ఈమె పాత్ర సినిమాలో చాలా కీలకంగా ఉంటుంది అని తెలుస్తుంది. ఇదిలా ఉంటే ఉగాది సందర్భంగా ఈ సినిమాకి సంబంధించిన బాలకృష్ణ ఫస్ట్ లుక్ పోస్టర్స్ ని రిలీజ్ చేసి మూవీపై



అంచనాలు పెంచేశారు. మాసిన గడ్డంతో డిఫరెంట్ హెయిర్ స్టైల్ తో బాలకృష్ణ కనిపిస్తూ ఉండటం విశేషం. గత కొంతకాలంగా అక్టోబర్ 21న రిలీజ్ అవుతుంది అనే ప్రచారం నడుస్తూ ఉంది. ఈ ప్రచారానికి బలం చేకూర్చే విధంగా ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ను అనౌన్స్ చేయబోతున్నట్లుగా టాక్ వినిపిస్తూ ఉంది. ఈ సినిమా అఫీషియల్ రిలీజ్ డేట్ ని కన్ఫామ్ చేయడానికి చిత్ర యూనిట్ రెడీ అవుతున్నట్లుగా సమాచారం. ప్రోమో ద్వారా ఈ మూవీ టైటిల్ ని రిలీజ్ చేసే ఛాన్స్ ఉందని టాక్. తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో హై వోల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్ అండ్ ఎంట్టంల్గ÷న్మెంట్ తో ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తూ ఉండడం విశేషం. ఇప్పటికే షూటింగ్ రెండో షెడ్యూల్ నడుస్తుంది అని తెలుస్తుంది. వీలైనంత వేగంగా మూవీ పూర్తి చేసి అక్టోబర్ నాటికి ప్రేక్షకులకి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బోగట్టా. ఇదిలా ఉంటే ఈ మూవీ తర్వాత నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను దర్శకత్వంలో నాలుగో సినిమాని చేయడానికి సిద్ధం అవుతున్నట్లుగా ఇండస్ట్రీ టాక్. కంప్లీట్ పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో ఏపీ రాజకీయాలను రిప్రజెంట్ చేసే కథాంశంతో సినిమాని దర్శకుడు బోయపాటి ఆవిష్కరించబోతున్నట్లుగా ప్రచారం నడుస్తూ ఉంది.

# హను-మాన్ పోస్టర్ విడుదల

టాలెంటెడ్ డైరెక్టర్స్ లిస్ట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఒకరు. మొదటి సినిమాతోనే వావ్ అనిపించిన అతను సినిమా సినిమాకు తన రేంజ్ పెంచుకుంటూ వెళ్తున్నాడు. ప్రస్తుతం తేజ సజ్జాతో ఫస్ట్ ఇండియన్ సూపర్ హీరో మూవీ చేస్తున్నాడు ప్రశాంత్ వర్మ. హనుమాన్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా టీజర్ తోనే సూపర్ బజ్ ఏర్పరచుకున్నారు. ఇక సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ ప్రేక్షకులను అలరిస్తుంది. లేటెస్ట్ గా హనుమాన్ సినిమా నుంచి శ్రీరామనవమి సందర్భంగా ఒక పోస్టర్ రిలీజ్ చేశారు. హనుమంతుడు గుండెల్లో కొలువుదీరిన సీతారాములను చూపిస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ అదిరిపోయింది. హనుమాన్ సినిమా లో బీభత్సమైన గ్రాఫిక్స్ ఉన్నట్టు తెలుస్తుంది. హనుమాన్ కథాంశంతో ఈ సినిమా వస్తుందని అర్థమవుతుంది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాను చాలా ఫోకస్ గా తెరకెక్కిస్తున్నారు.



సినిమాను ఏప్రిల్ 6 హనుమాన్ జయంతి రోజు రిలీజ్ ఫిక్స్ చేశారు. ఇది కేవలం పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్ సినిమాగా ప్రపంచ వ్యాప్తంగా భారీగా రిలీజ్ ఎ÷-లాన్ చేస్తున్నారు. తేజ సజ్జాతో ఆల్రెడీ జాంబి రెడ్డి సినిమా తీసి హిట్ అందుకున్న ప్రశాంత్ వర్మ అతనితోనే హనుమాన్ తో భారీ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా గురించి ఇండస్ట్రీలో కూడా ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. అయితే ప్రశాంత్ వర్మ మాత్రం సినిమా నుంచి ఎలాంటి లీకులు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. రామ నవమి సందర్భంగా హనుమాన్ లీడ్ హీరో తేజ సజ్జా హనుమాన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ఇలా రిలీజ్ చేశారో లేదో అలా వైరల్ గా మారింది. ప్రశాంత్ వర్మ హనుమాన్ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# పొన్నియన్ సెల్వం-2 ట్రైలర్ విడుదల

మణిరత్నం కలల ప్రాజెక్ట్ 'పొన్నియిన్ సెల్వన్' లో బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో ఈ మూవీ రెండు భాగాలుగా తెరకెక్కింది. మొదటి భాగం 'పొన్నియిన్ సెల్వన్ ఎ' గతేడాది సెప్టెంబర్ 30న విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. దాంతో.. రెండో భాగంపై భారీ క్రేజీ ఏర్పడింది. 'పొన్నియిన్ సెల్వన్ 2' ని ఏప్రిల్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో మూవీ టీజర్‌ని విడుదల చేసింది. అందులో.. ఐశ్వర్య లుక్స్ చూసి సినీ లవర్స్ ఫిదా అయిపోతున్నారు. నటి యాక్టింగ్ సూపర్ ఉందని ప్రశంసలు కురిపిస్తున్నారు. అంతేకాకుండా.. ఐశ్వర్యలోని నటిని హిందీ చిత్ర పరిశ్రమ సరిగా ఉపయోగించుకోలేకపోయిందని విమర్శలు చేస్తున్నారు. ఓ నెటిజన్ అయితే.. ' మణిరత్నంలాగా ఐశ్వర్యను బాలీవుడ్ ఉపయోగించుకోలేక పోయింది. ఈ తార నందిని పాత్రలో చాలా క్రూరంగా, అలాగే ప్రసన్నంగా కనిపించింది' అని ఒకరు.. 'నందిని పాత్ర కోసమే ఐశ్వర్య పుట్టింది. ఆమె తన అందాన్ని అన్నింటికంటే ప్రాణాంతకమైన ఆయుధంగా ఉపయోగించే రాణి. కొన్నాళ్ల క్రితం నేను పీఎస్ పుస్తకాన్ని మొదటిసారి చదివినప్పుడే, ఐశ్వర్యని నేను నందినిగా ఊహించుకున్నాను' అని మరొకరు రాసుకొచ్చారు. 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాన్ని కల్కి రాసిన నవల ఆధారంగా మణిరత్నం తెరకెక్కించాడు. ఈ చిత్రంలో జయం రవి, విక్రమ్, కార్తీ, త్రిష కృష్ణన్, ఐశ్వర్య లక్ష్మి, ప్రకాష్ రాజ్, శోభిత ధూళిపాళ కీలక పాత్రల్లో నటించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు.

## ముల్కనూర్ డెయిరీకి మార్కెటింగ్ కొరకు ఒక కోటి మూడు లక్షల ప్రాజెక్ట్

**భీమదేవరపల్లి మార్చి 30 (ప్రజామంటలు):** ములుకనూరు మహిళా సహకార డెయిరీ, జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో "గడ్డి విత్తనాలు ఉత్పత్తి పంపిణీ " విధానంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ములుకనూరు డెయిరీకి మార్కెటింగ్ కొరకు 1 కోటి 3 లక్షల



ప్రాజెక్టును ఇచ్చారు. ఇందులో 57.15 లక్షలు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ములుకనూరు డేయిరీ మహిళా రైతుల ఫిల్డ్ విజిట్ కు వెళ్లారు. అక్కడ మొక్కజొన్న, జొన్న చేనులు పరిశీలించారు. ఆ తరువాత డెయిరీ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి చైర్ పర్సన్ మనీష్ షా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డెయిరీ రైతులకు గడ్డి విత్తనాలు, మినీ కిట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి, శాస్త్రవేత్త భూపేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ పల్లెకథ ఆధారంగా దసరా

## నాని నటన హైలెట్

టాలీవుడ్లో అత్యంత ప్రతిభావంతులైన యువ నటుల్లో నాని ఒకడు. కెసుకుమార్ శిష్యుడైన కొత్త దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రూపొందించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలంగాణ ప్రాంతంలోని వీర్లపల్లి అనే గ్రామంలో 90వ దశకంలో నడిచే కథ ఇది. ఆ ఊర్లో ధరణి (నాని).. వెన్నెల (కీర్తి సురేష్).. సూరి (దీక్షిత్) చిన్నప్పట్నుంచి స్నేహితులు. ధరణికి వెన్నెల అంటే ఇష్టం. వెన్నెల ఏమో సూరిని ఇష్టపడుతుంది. ఈ ముక్కోణపు ప్రేమకథ ఇలా సాగుతుండగా.. ఆ ఊరి సర్పంచ్ పదవికి సంబంధించిన గొడవ వల్ల ఈ ముగ్గురి జీవితాలు ఊహించని మలుపు తిరుగుతాయి. ఆ మలుపేంటి.. తర్వాత ఏం జరిగింది అన్నది తెర మీదే చూడాలి. తెలుగు సినిమాలంటే సహజత్వం ఉండదని.. ఒక మూసలో సాగిపోతాయని.. హీరోలు ఎక్కడ్నుంచో ఊడి పడ్డట్లు ఉంటారని నిట్టూరుస్తూ.. తమిళం మలయాళ చిత్రాలతో పోల్చుకుని నిరాశ చెందే వాళ్ళం ఒకప్పుడు. కానీ గత కొన్నేళ్లలో మన కథలు చాలానే మారాయి. మన మట్టి కథల్లో కూడా కమర్షియాలిటీ ఉందని ఇక్కడి ఫిల్మ్ మేకర్స్ అర్థం చేసుకుని.. మన నేటివిటీతో సినిమాలు తీస్తున్నారు. నేటివిటీ ఫ్యాక్టర్ని హైలైట్ చేస్తూ.. సామాన్య పాత్రల్ని అసామాన్యంగా చూపిస్తూ తీసిన రంగస్థలం.. పుష్ప లాంటి సినిమాలు మంచి ఫలితాన్ని అందుకున్నాయి. ఇప్పుడు అదే కోవలో వచ్చిన చిత్రం.. దసరా. 90వ దశకంలో సింగరేణి ప్రాంతంలోని ఒక పల్లెటూరి నేపథ్యంలో చాలా నాటుగా తీసిన సినిమా ఇది. నాని పెర్ఫార్మెన్స్ కి తోడు స్టాండ్ ఔట్ గా నిలిచే కొన్ని ఎపిసోడ్లతో బలమైన ముద్రే వేస్తుంది. కథగా చూస్తే ఇదొక సగటు రివెంజ్ డ్రామాలాగా అనిపించినా.. ట్రీట్మెంట్ భిన్నంగా ఉండటం వల్ల 'దసరా' ఒక వైవిధ్యమైన సినిమా చూసిన ఫీలింగ్ కలిగిస్తుంది. టిపికల్ గా ప్రెజెంట్ చేస్తే ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇవ్వొచ్చని సుకుమార్ 'రంగస్థలం'తో రుజువు చేస్తే.. ఆయన శిష్యుడు శ్రీకాంత్ ఓదెల కూడా అదే బాటలో నడిచాడు. గురువు గోదావరి ప్రాంత నేపథ్యంలో గ్రామీణ రాజకీయాలతో ముడిపెట్టి 'రంగస్థలం' తీస్తే.. శిష్యుడు పక్కా తెలంగాణ నేటివిటీతో సినిమా తీశాడు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో.. అక్కడి రాజకీయాల చుట్టూ తిరిగే పక్కా కమర్షియల్ సినిమాగా 'దసరా'ను చెప్పొచ్చు. మనల్ని ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లినట్లుగా దర్శకుడి విజన్ కు తగ్గట్లుగా సాంకేతిక విభాగాలన్నీ 'దసరా'కు వెన్నుదన్నుగా నిలిచాయి. నాని సహా నటీనటులందరూ అదిరిపోయే పెర్ఫామెన్స్ ఇవ్వడం.. సన్నివేశాలు కూడా ఆసక్తికరంగా సాగడంతో 'దసరా'తో కనెక్ట్ అయిపోతాం. 'దసరా'లో హైలైట్ అంటే ప్రథమార్ధమే. వీర్లపల్లి అనే గ్రామంలో సర్పంచి ఎన్నికల చుట్టూ దశాబ్దాలుగా సాగుతున్న రాజకీయ పరిస్థితులను దర్శకుడు బాగా ఎస్టాబ్లిష్ చేశాడు. ముందు కథ చెప్పి.. ఆ తర్వాత మూడు ప్రధాన పాత్రలతో ప్రేక్షకులకు ఎమోషనల్ కనెక్షన్ ఏర్పడేలా చేశాడు. క్రికెట్ ఎపిసోడ్.. ఆ తర్వాత ఎన్నికల సీన్.. కథ రసపట్టులో పడేందుకు కారణమయ్యాయి. ఇంటర్వెల్ ఎపిసోడ్ సినిమాలో స్టాండౌట్ గా నిలుస్తుంది. ఒళ్లు గగుర్పొడిచేలా ఆ ఎపిసోడ్ ను తీర్చిదిద్దాడు దర్శకుడు. నాని-కీర్తి సురేష్ తమ పెర్ఫామెన్సులతో ద్వితీయార్ధాన్ని కొంత నిలబెట్టారు కానీ.. చాలా సీన్లు బోరింగ్ గా అనిపిస్తాయి. 'దసరా'ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లడానికి దర్శకుడికి మంచి అవకాశం లభించినా అతను ఉపయోగించుకోలేదు. ప్రథమార్ధంలో అతను చూపించిన ప్రతిభను కొనసాగించి ఉంటే.. అలాంటి స్టాండౌట్ సీన్లు కొన్ని పడి ఉంటే 'దసరా' రేంజే వేరుగా ఉండేది. కీర్తి సురేష్ చాన్నాళ్ల తర్వాత తెలుగులో తనదైన ముద్ర వేసింది. చాలా కొద్దిమంది హీరోయిన్లు మాత్రమే ఈ పాత్రను చేయగలరు. 'మహానటి' స్థాయి కాదు కానీ.. నటన పరంగా కీర్తి కెరీర్లో ఇది ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ పాత్రల్లో ఒకటి. తెలంగాణ యాస విషయంలో ఆమె ఓకే అనిపించింది. కీర్తి నాటు డ్యాన్స్ భలేగా అనిపిస్తుంది. తెలుగులో తొలి సినిమా అయినప్పటికీ దీక్షిత్ శెట్టి బాగా చేశాడు. 'చమ్కీల అంగీలేసి' సహా సంతోష్ నారాయణన్ పాటలన్నీ బాగున్నాయి.

# ప్రసాద్ మల్టీప్లెక్స్ వద్ద అభిమాని హంగామా

## దసరాలో నాని లాగా చేయబోయాడు

నటుల్ని అభిమానించే అభిమానులు కూడా నటుల్ని అనుకరించి ఈ మధ్య హంగామా చేస్తున్నారు. తాజాగా విడుదల అయిన 'దసరా' సినిమా విషయంలో జరిగింది. 'దసరా' సినిమాలో నాని పాత్ర బాగా తాగుతూ ఉంటాడు, అలాగే బొడ్డు చుట్టూ ఒక నాలుగు అయిదు ఆల్కహాల్ బాటిల్స్ కూడా కట్టుకొని తిరుగుతూ ఉంటాడు. అది స్ఫూర్తిగా తీసుకున్నాడేమో ఒక అభిమాని నాని చేసినట్టుగానే బాటిల్స్ మేడలో వేసుకొని ప్రసాద్ మల్టీప్లెక్స్ ఐరన్ ఫెన్స్ ఎక్కేసాడు. ఈ అభిమానం మరీ అతిగా ఉందని అక్కడకి వచ్చిన ప్రేక్షకులు అందరూ అనుకుంటున్నారు. వెంటనే ఒక సెక్యూరిటీ గార్డ్ ఫెన్స్ ఎక్కి ఆ అభిమానిని కిందకి దించాడు. ఫెన్స్ ఎక్కినా అభిమానికి కిందపడి ఏమైనా అయితే ఎవరు బాధ్యులు. ఇలా బాధ్యతరహింతా అభిమానులు చేస్తూ ఉంటే ఎలా అని అక్కడ ప్రేక్షకులు కూడా వాపోతున్నారు. పోనీ అదేమయిన మంచి పాత్ర అని అనుకునే కాదు కూడా అని అంటున్నారు. ఈమధ్య వెంకటేష్ కి కూడా ఇలానే అయింది. ఎంతో మంచి ఇమేజ్ వున్నా వెంకటేష్ 'రానా నాయుడు' అనే వెబ్ సిరీస్ లో చేసాడు. అందులో తన అన్న కుమారుడు రానా దగ్గుబాటి కూడా చేసాడు. ఇది పూర్తిగా అడల్ట్ కంటెంట్ తో కూడిన వెబ్ సిరీస్ అవటం, వెంకటేష్ పిల్లాడితో కూడా బూతులు మాట్లాడటం ఒక్కసారిగా సమాజంలో అన్ని వర్గాల వారి నుండి వ్యతిరేకత వచ్చింది. చేసేది లేక ఆ వెబ్ సిరీస్ ని తొలగించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com